11/12/05

Entered

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

డిసెంబర్ 11, 2005

అమరావతి ఆతిథ్యంలో

'కాలచక్ర'



హ్యాపీ బర్త్‌డే

(11.12.2005 నుంచి 17.12.2005 వరకు)

రీనా
4సం॥, 12.12.2001
సునీత-గోపి
అంతర్వేది-తూ॥గో॥

పి. బిందుపావని
1సం॥, 13.12.2004
ఝాన్సీరాణి-అంజిబాబు
మచిలీపట్నం-కృష్ణా

లాస్య
3సం॥, 16.12.2002
సుమతి-అనీల్‌కుమార్
హైదరాబాద్

కె. గోపి భార్గవ్-ప్రవీణ్
6సం॥, 13.12.1999
చంద్రకళ-ఖాసీం
పాల్వంచ-ఖమ్మం

ఐ. శ్రీసాయి దీపిక
2సం॥, 14.12..2003
పార్వతి-ప్రసాద్
చాగల్లు-ప॥గో॥

పి. సృజన్
5సం॥, 15.12.2000
పద్మశ్రీవాస్తవ్-రాజ
జిన్నూరు

ఎన్. స్ఫూర్తి
8సం॥, 15.12.1997
బేబిరాణి-సూర్యనారాయణ
కాకినాడ-తూ॥గో॥

విద్యాసాగర్
3సం॥, 17.12.2002
శ్రీలక్ష్మి-యాదయ్య
అమిస్తాపూర్-మ॥ నగర్

భార్గవి
దేవిక-రాములు
పటేల్‌నగర్-హైదరాబాద్

కె.అర్చన
1సం॥, 16.12.2004
రాధిక-శ్రీనివాస్
ఖమ్మం

ఆర్. రమ్య తేజ
8సం॥, డిసెంబర్-1997
నిర్మలచౌదరి-దాస్ చౌదరి
హయత్‌నగర్-రంగారెడ్డి

పి. సాయి
లలిత-శ్రీహరి
దామెగుండ-నెల్లూరు

ప్రశాంత్‌కుమార్
1సం॥, డిసెంబర్-2004
మంజుల-సత్యనారాయణ
తాళ్లపల్లి-రంగారెడ్డి

అలేఖ్య
4సం॥, డిసెంబర్-2001
కనకమహాలక్ష్మి-శేఖర్‌కుమార్
రేచర్లపేట-తూ॥గో॥

ఎన్. భారత్
దేవిక-రాములు
పటేల్‌నగర్-హైదరాబాద్

కె. హస్వల్
ధనలక్ష్మి-ప్రసాద్
కోంటేపేట-డోన్

వి. ఎస్.కె. రోహిత్(బబ్లు)
9సం॥, డిసెంబర్-1996
రేవతి-ప్రసాద్
పెనుబల్లి-ఖమ్మం

కె. అలేఖ్య
3సం॥, 17.12..2002
అనూరాధ-నాగమల్లేశ్వరరావు
చందోలు-గుంటూరు

టి. సంయుక్తారాణి
3సం॥, డిసెంబర్-2002
తిరుపతమ్మ-వెంకటస్వామి
నందికొట్కూర్-కర్నూలు

మన అతిథి గురించి...

పేరు	:	డా॥ కాలువ మల్లయ్య
పుట్టిన ఊరు	:	కరీంనగర్ జిల్లా, జూలపల్లి మండలం, తెలుకుంట గ్రామం
పుట్టిన తేదీ	:	2-1-1953
విద్య	:	ఎమ్మెస్సీ, బిఎడ్. పిజిడిపిఆర్ ఎమ్.ఏ.పిహెచ్.డి
వృత్తి	:	ఫ్రీలాన్స్ జర్నలిజం... రచయిత
సభ్యులు	:	ఆం.ప్ర.అధికార భాషా సంఘం
నచ్చిన వ్యక్తి	:	డా॥ బాబా సాహెబ్ అంబేద్కర్, మదర్ థెరిస్సా
నచ్చని అంశం	:	అదృష్టాన్ని నమ్ముకోవడం
హాబీలు	:	నిరంతర సామాజిక, పుస్తక అధ్యయనం రోజూ కొంతైనా రాయడం



మనిషిని ప్రేమించే విలువలుండాలి

మాక్సిం గోర్కీ అమెరికాకు వెళ్ళి ఓ పారిశ్రామిక వేత్తను మీకేమైనా పుస్తకాలు తెలుసా అనడిగాడు. చెక్‌బుక్ తప్ప నాకే పుస్తకము తెలియదన్నాడా వ్యక్తి. అందుకే అమెరికాను స్వర్ణ పిశాచనగరంగా వర్ణించాడు గోర్కీ... పెట్టుబడిదారీ సమాజంలో విలువలెలా ఉంటాయో దీంతో అర్థమవుతుంది. రాచరిక వ్యవస్థలు అమల్లో ఉన్న కాలంలో ఓ కవి... జనానా గుణగణము కాంచనంబున నిలుచున్' అన్నాడు. విలువలు ఆయా సమాజాలను బట్టి మారుతూ ఉంటాయి. కాని, ప్రజాస్వామ్య సమాజంలోనూ డబ్బు విలువలే చలామణి కావటం, రాజకీయ విలువలు వలువలొలిచే దిశగా ప్రయాణించడం విషాదకరం.

సమాజం సుఖవాంఛ వైపు, డబ్బు దిక్కు పయనిస్తూ మానవ సంబంధాలు డబ్బు సంబంధాలుగా మారుతుంటే ఆ సమాజంలో శాంతి సుఖాలు దొరకడం కష్టం. విలువలను కొలిచే ప్రమాణాలను పాశ్చాత్య, ఆధిపత్య, డబ్బు దృష్ణి కోణంలోంచి చూడటం ఈ అనర్థాలన్నిటికీ కారణం. ఆది మానవుడికి జన్మనిచ్చిన ఆఫ్రికా ఖండాన్ని చీకటి ఖండంగా, అత్యంత ప్రాచీన దేశాలను వెనుకబడిన దేశాలుగా లెక్కపెట్టడం విలువలను కొలిచే విధానంలో ఉన్న తప్పుడు దృష్టి కోణం వల్లనే... క్రీస్తు, గౌతమ బుద్ధుడు, మహమ్మద్ ప్రవక్తలకు జన్మస్థానమైన ఆసియాఖండం వెనుకబడిన ఖండంగా చూడటం విలువల దృష్టి కోణంలో ఉన్న లోపం వల్లనే... ఆ దృష్టి కోణం మారినప్పుడే విలువలను సరిగ్గా నిర్వచించడం సాధ్యమవుతుంది.

తెలుగు సమాజంలో ఒకప్పుడు ఇంటికొచ్చిన అతిథి భోజనం చేయందే పోనిచ్చేవారు కాదు. పెళ్ళిళ్ళంటే అటు ఏడు, ఇటు ఏడు తరాల చరిత్రలను చూసేవారు. ఇప్పుడు అన్నీ పూర్తి యాంత్రికంగా జరుగుతున్నాయి. సమాజం మేము నుండి నేనులోకి పయనిస్తోంది. పిల్లలను బాల్యానికి, సృజనాత్మకతకు దూరం చేసి జైలు బళ్ళకు పంపడం, తల్లి దండ్రులను వృద్ధాశ్రమాలకు తోలడం, చదువుల పరమార్థం బాగా సంపాదించడంగా మారడం, విద్యాలయాలు బాగా డబ్బు సంపాదించే కేంద్రాలవడం విలువల పతనంలో భాగాలే... అందుకే సమాజంలో ఎంతో ఒత్తిడి అ మానవీయ పోటీ

డబ్బు సంపాదించడంలోనూ మానవాంశ ఉండాలన్న అమర్త్యసేన్ మాటలు శిరోధార్యాలు కావాలి. మనిషిని మనిషిగా చూసేవి, మానవాంశను పెంపొందించేవి, పని సంస్కృతిని ప్రేమింపజేసేవే అసలైన విలువలు... ఆ దిశగా విలువల పునర్మూల్యాంకనం జరగాలి.

కాలువ మల్లయ్య

ఈ సంచికలో...

ఉషా	...	2
మనసా తెలుసా		3
టర్నింగ్‌పాయింట్		4
సలహాలు	...	5
ఇంటి సంగతులు	...	6
క్యాంపస్ ఛాట్	...	10
సినిమా కబుర్లు	...	11
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
మనమూ మన నమ్మకాలు		20
ఓ ఊరి కథ	...	21

ఇంకా,,,



నేర్చుకుందాం రా 7

డిజైన్ ఇలా వేయండి

కథ 18

చెదరని ఆకాంక్ష

సీరియల్ 8

మాధవి

ఆరోగ్యం	...	17
ఓ మంచి పుస్తకం	...	19
అవీ... ఇవీ		22
విజ్ఞానవీచిక	...	23
కొత్త పుస్తకాలు	...	24

ఆసక్తిగా...

స్నేహ... నిత్యనూతనంగా ముస్తాబై... స్నేహదాయకంగా విజ్ఞానాన్నందిస్తోంది. మన జాతీయ నోబుల్ జ్ఞానపీఠ్. 1965 నుంచి అవార్డునివ్వటం ప్రారంభించారనీ, ఇప్పటివరకు 41 మందికి లభించిందనీ, తొలి జ్ఞానపీఠ్ మలయాళీ రచయిత శంకర్ కురూప్‌కు దక్కిందనీ తెలుసుకున్నాం. ఈ అవార్డునేవిధంగా ఎంపిక చేస్తారు? ఏ వయస్సు వారికిస్తారు? అనే విషయాలు ఆసక్తి కలిగించాయి. ఈ జ్ఞానపీఠ్ అవార్డు తెలుగువారిలో మొదట విశ్వనాథసత్యనారాయణకు, తరువాత డాక్టర్ సి. నారాయణరెడ్డికి వచ్చిందన్న విషయాన్ని మర్చిపోలేం. అట్టమీది కథ... ఒట్టిగా కాకుండా, గట్టిగా అందించిన మీకు నా నమస్కారాలు.

కర్రా వరప్రసాద్, యలమర్రు కండ్రిక, కృష్ణాజిల్లా



ప్రకాశించాలి

సాహితీ ప్రియుల షడ్రుచుల విందుగా జ్ఞానపీఠ్ అవార్డు గురించి, నెలకొల్పిన రమాజైన్‌గారి గురించి, స్నేహ ద్వారా వడ్డించినందుకు ధన్యవాదాలు. అనన్య ప్రజ్ఞగల సాహితీ వేత్తలకు ప్రతిఏటా ఇచ్చే ఈ అరుదైన సత్కారాన్ని కలం పట్టిన ప్రతివ్యక్తీ స్మరించుకోవాలి. ఈ ఏడు జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత జయకాంతన్‌కు శుభాకాంక్షలు. మన దిగ్గజాలు శ్రీశ్రీ, ఆరుద్ర, శేషేంద్ర శర్మల వలె అన్ని భాషలలోనూ అర్హులు అరుదు. అటువంటి వారికి ఈ జ్ఞానపీఠ ఎందుకు రాలేదా? అనే తలంపు రాకుండా ఉండాలి. అర్హుల మెడలో కంఠాభరణంగా ఈ జ్ఞానపీఠ్ ప్రకాశించాలి. ఇంత చక్కటి అంశాన్ని స్నేహ ద్వారా మా ముందుంచినందుకు అభినందనలు.

యర్రమోతు ధర్మరాజు, ధవళేశ్వరం

వారిబాటలోనే

'టర్నింగ్ పాయింట్' శీర్షికలో ఓ మహనీయుడి ఆత్మార్పణాన్ని వివరించారు. అహర్నిశలూ శ్రమించి, నిరాహారదీక్షకు పూనుకొని, చివరికి ఆంధ్రరాష్ట్రాన్ని సాధించిన పొట్టి శ్రీరాములు... తన జీవితాన్ని రాష్ట్రానికంకితం చేసిన అమరజీవి. ఆంధ్రరాష్ట్రం ఉన్నంత వరకు ఆయన ఆంధ్రుల హృదయాలలో చిరంజీవిగా జీవిస్తూనే ఉంటారనేది అక్షరసత్యం. అలాంటి మహానుభావునికి మనమంతా కలిసి నివాళులర్పిద్దాం. వారిబాటలోనే నడుస్తూ... శాంతి పథంలో పయనిద్దాం.

మేడూరి సత్యనారాయణ, ఖైరతాబాద్, హైదరాబాద్

వారమంతా

నేను ప్రతిరోజూ ప్రభాత సమయాన ప్రజాశక్తి దినపత్రిక చదువుతాను. తరువాతే నా ఇంటిపనులు చూస్తాను. నాకు ఈ పత్రికంటే అంత అభిమానం. ఇహ స్నేహ కోసం వారమంతా కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తాను. ఇంత చక్కటి పత్రికకు నా కృతజ్ఞతలు.

మీ అభిమాన పాఠకురాలు, దివ్య

తెలుసుకోగలుగుతున్నాం

బతుకు తెరువుకోసం పనిలో చేరిన ఎందరో స్త్రీలు... భూస్వామి తవిటిరాజులాంటి పెద్దమనుషుల చేతిలో బలైపోతున్నారు. ఇటువంటి పరిస్థితులెదురైనప్పుడు చిన్నారావు లాంటి వ్యక్తులు ఎక్కడో ఒక చోట ఉండనే ఉంటారని 'ఆ కోపం తీరేనా' కథ తెలియజేస్తుంది. నేటి జీవన సరళిలో వాస్తు ప్రభావం చాలా ఎక్కువగా ఉంటోంది. దానికి తగ్గట్లుగా 'వాస్తులో వాస్తవమెంత' శీర్షిక ఉపయోగకరమే. ప్రతివారమూ 'ఓ ఊరికథ'ను ప్రచురిస్తుండం వల్ల ఎన్నో చారిత్రాత్మకమైన స్థలాలను గురించి తెలుసుకోగలుగుతున్నాం.

కొప్పల కాశీ విశ్వేశ్వరరావు, మర్రిపాలెం, విశాఖ

చక్కగా

ఈ 'అట్టమీది కథ' మన జాతీయ నోబెల్ జ్ఞానపీఠ్ అవార్డు! ఏడాది జ్ఞాన పీఠాన్నధిరోహించిన తమిళ అభ్యుదయ రచయిత డి. జయకాంతన్ సాహిత్య చరిత్రను చక్కగా అందించారు. ఈ అవార్డు పొందిన ఇద్దరిలో డా సి. నారాయణ రెడ్డి గారి సాహితీజీవిత విశేషాలు చాలా అద్భుతంగా ఉన్నాయి. ఈ సంచికతో వచ్చిన విశేషాలన్నీ ఒక దాన్ని మించి ఒకటిగా ఉన్నాయనడానికి ఎట్టి సంశయమూ లేదు. 'టర్నింగ్‌పాయింట్' ఒక మహనీయుని ఆత్మార్పణం చాలా బాగుంది.

సిరిపురపు రామకోటేశ్వర్రావు, ఎనికేపాడు

స్నేహతో స్నేహం మాకు గొప్పవరం- అది లేటైననాడు మా మనసుకు కలవరం
ఇది అద్భుత విషయాల సమాహారం కాబట్టే ఈ అనుబంధం సాగుతుంది ప్రతివారం.

అనుగోలు నాగబ్రహ్మం, చిలుకూరు, నల్లగొండ జిల్లా

మనసా... తెలుసా?

మీ పిల్లలు... వారి సమస్యలను, తమ స్నేహితులతో పంచుకోలేని మనో భావాలను మీ వద్ద బాహాటంగా మనసు విప్పి చెప్పారనుకోండి. మీరు వారితో స్నేహసంబంధాలను కలిగి ఉన్నట్లే.

హిప్నో కమలాకర్

కౌన్సెలింగ్ సైకాలజిస్ట్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్, ఫోన్ : 9849130141

తల్లీదండ్రులూ - పిల్లలు

ఓ ఫ్రెండ్ సర్కిల్

చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలతో స్నేహం చేయడానికి అంగీకరించరు. దీనికి కారణం... పిల్లల్లో మానసిక పరిపక్వత మనస్థాయికి తగ్గట్లుగా ఉండదు. వారిని దండించి దారిలోకి తీసుకురావాలి. అంతేగానీ వారితో 'స్నేహం చేయడమేంటి' అని తల్లిదండ్రులు భావించడమే. తల్లిదండ్రులు కాస్త దిగొస్తే... పిల్లలతో స్నేహ సంబంధాలను ఏర్పరుచుకోవడం సులభమంటున్నాడు జెమెగ్రో (Jay Mc Graw). ఎంత కఠినమైన ఒప్పందమైనా... స్నేహపూర్వకంగా ప్రతిపాదిస్తే ఎవ్వరూ తోసిపుచ్చలేరు. పిల్లల వయసు కంటే తల్లిదండ్రుల వయసు ఎంతో ఎక్కువ. పిల్లల మాటలతో పోల్చుకుంటే... వీరి మాటలెంతో బలమైనవి. శక్తివంతమైనవి. విజ్ఞానపూరితమైనవి. అలాంటి మాటలను పిల్లలెలా కాదంటారు? ఒకవేళ కాదంటున్నారంటే మీరు చెప్పాల్సిన రీతిలో వారికి చెప్పలేదన్న మాట!

మనసులో మాట చెప్పారంటే....

మీ పిల్లలు... వారి సమస్యలను, తమ స్నేహితులతో పంచుకోలేని మనో భావాలను మీ వద్ద బాహాటంగా మనసు విప్పి చెప్పారనుకోండి. మీరు వారితో స్నేహసంబంధాలను కలిగి ఉన్నట్లే. వారు మీతో సాధారణంగా చర్చించే విషయాలు ఏ కోవకు చెందినవో గమనించండి. అప్పుడే మీ పిల్లలు మీతో ఏ మేరకు మనసు విప్పి మాట్లాడుతున్నారో మీకర్థమౌతుంది. మీ పిల్లలు తమ మనోభావాలను మీతో చెప్పడానికి వీలుగా పలు అవకాశాలు వారికి కల్పించాలి. వారితో సినిమాలకు వెళ్లినంత మాత్రాన స్నేహం పెంపొందదు. మితిమీరి స్నేహం చేసినా... అది మరొకందుకు దారితీయవచ్చు. నాకు తెలిసిన ఒక కుటుంబంలో తండ్రి తన కొడుకుతో కలిసి మందుకొట్టేవాడు. వాళ్లది కాస్త ఉన్నత కుటుంబం. ఇక్కడ ఉన్నత కుటుంబమని ఎందుకుచెప్పాల్సొచ్చిందంటే, ఉన్నత ఆదాయంగల వర్గాలలో నాగరికత పేరుతో కొంత విపరీతపోకడలు కనిపిస్తూంటాయి. ఇంట్లోనే మందు పార్టీలు, ఇతర ఫంక్షన్‌లు జరుగుతూంటాయి. ఇక్కడ తండ్రి, తన కొడుకుతో స్నేహసంబంధాలను పెంచుకోవాలనే తపనతోనే కలిసి మందు కొట్టడానికి ప్రేరేపితుడయ్యాడన్నది నిజం. ఈ చర్యల యొక్క పర్యవసానం... ఆ అబ్బాయి అతని మాట వినడం మానేశాడు. మందుకు అలవాటు పడిపోయాడు. పాశ్చాత్య సంస్కృతి వల్ల పిల్లలు, పెద్దలు కలిసిపోతున్నట్టుగా కన్పిస్తుంది. కానీ కుహనా సంస్కృతి



ప్రభావం విస్తారంగా కనిపిస్తుంది. అందుకే తల్లిదండ్రులు ఇటువంటి కార్యక్రమాలకు చాలా దూరంగా ఉండాలి.

ఇలా ఉంటే...

★ తల్లిదండ్రులుగా, మీ మూర్తిమత్వాన్ని మీ పిల్లలు ఆదర్శంగా చేసుకునేలా మీ ప్రవర్తన ఉండాలి.

★ పిల్లలు యుక్త వయస్సుకు వస్తే, వారికి ఒక ప్రత్యేక తరహా వ్యక్తిత్వమేర్పడుతోందని మీరు గ్రహించాలి.

★ ఎదుటివ్యక్తికి ఎంత గౌరవమర్యాదలు ఇస్తారో, అదేవిధంగా, ఎదిగిన పిల్లలకూ గౌరవమివ్వండి.

★ ఇంట్లో, వారి ఉనికిని గుర్తించండి. వారి భాగస్వామ్యాన్ని స్వాగతించండి.

★ ఇంటా బయటా మీతో కలిసి గడపడం వారికి అన్నిరకాలుగా ఇష్టదాయకమైన చర్యగా మీరు చేయాలి.

★ వారి మాటల్ని శ్రద్ధగా ఆలకించండి. వారేదైనా చెప్పినపుడు మీ పని మీరు చేసుకోవడం, పేపర్లో తలదూర్చడం, టీ.వి చూస్తూ కూర్చోవడం, వంటి చర్యలు చేయకండి.

★ ఆడపిల్ల విషయంలో... తల్లి సరిగ్గా విశ్లేషించలేని కొన్ని సమస్యలను తండ్రులు మాత్రమే స్పష్టంగా విశ్లేషించగలరు.

మీ టీనేజీపిల్లలు మీపై విప్లవశంఖారావం పూరించేలా నిబంధనలను విధించకండి. చక్కని మైత్రీసంబంధాలను పెంచుకున్న తర్వాతే నిబంధనలు పెట్టండి. వారప్పుడు వాటికి కట్టుబడి ఉంటారు. టీనేజీ పిల్లలు, తమ మారుతున్న దృక్పథాలకు అనుగుణంగా ఉండే నిబంధనల కోసం ఎదురుచూస్తారు. తమ తల్లిదండ్రులు తమపై ఏకఛత్రాధిపత్యం చేయడాన్ని పిల్లలు సహించరు. పసిపిల్లలు కఠినమైన నిబంధనలకు సైతం తలూపుతారు. తమ వ్యక్తిత్వాన్ని తల్లిదండ్రులు గుర్తించాలని టీనేజీ పిల్లలు కోరుకుంటారు. అదే సమయంలో తల్లిదండ్రుల వ్యక్తిత్వాలను, వారి దృక్పథాలను, ఒక వ్యక్తిగత దృక్పథంగానే పరిగణిస్తారు. అంతేగానీ తాము లోబడి ఉండాల్సిన "తప్పనిసరి పరిస్థితి" గా భావించరు. టీనేజీపిల్లల సైకాలజీ వారి చదువు విషయంలోనూ స్పష్టంగా ప్రతిబింబిస్తుంటుంది. తమ మనస్సును చూరగొన్న టీచర్ల మాటలను వీరు పాటిస్తుంటారు. తమకు నచ్చని వారిపై ఎదురు తిరుగుతుంటారు. ఆయా టీచర్లు బోధించే పాఠ్యాంశాలలోనూ వెనుకబడుతుంటారు. ఈ సంగతి తల్లిదండ్రులకు కొత్తేమీ కాదు. మీరు టీనేజీలో ఉన్నపుడు... మీ టీచర్లతో వ్యవహరించిన తీరు తెన్నులను గుర్తు తెచ్చుకోండి. అప్పట్లో మీకు ఫలానా టీచరంటే ఎందుకు ఇష్టంగా ఉండేదో తెలుసుకోండి. మీ పిల్లల విషయంలోనూ అదే సంభవిస్తోందని గ్రహించండి. పిల్లలకు ఆయా టీచర్ల వద్ద లభించిన ఆదరణ కానివ్వండి, వారి శైలి నచ్చడం కానివ్వండి వారికి ఆయా పాఠ్యాంశాల పట్ల ఆసక్తిని ఇనుమడింపచేస్తుంది.

✻

వకుళాభరణం రామకృష్ణ

క్రైస్తవమత చరిత్రలో ఒకానొక అతి ముఖ్య ఘటన సంస్కరణోద్యమంగా ఆరంభమైంది. ఇది మతవిప్లవంగా వినుతికెక్కింది. సంస్కరణోద్యమ స్ఫూర్తితో అసంఖ్యాక క్రైస్తవ మతావలంబకులు జిజ్ఞాస, ఆత్మస్థయిర్యం పెంచుకొని మతం చెప్పే ప్రతి అంశాన్ని గుడ్డిగా నమ్మే అలవాటును మానుకొన్నారు.

అచ్చు యంత్రం తెచ్చిన మత విప్లవం

సాంస్కృతిక పునరుజ్జీవనంతో మధ్య యుగాల 'చీకటి' అంతమై, 15వ శతాబ్దంలో ఆధునిక ఐరోపా ఆరంభమైంది. సకల మానవ విజ్ఞానాభివృద్ధికి సాహిత్య, కళారంగాలకు ఇది పునర్జన్మ. పునరుజ్జీవనం తెచ్చిన అనేకానేక మార్పుల గూర్చి మరోసారి తెల్సుకుందాం. క్రైస్తవమత చరిత్రలో ఒకానొక అతి ముఖ్యఘటన సంస్కరణోద్యమంగా ఆరంభమైంది. ఇది మతవిప్లవంగా వినుతికెక్కింది. సంస్కరణోద్యమ స్ఫూర్తితో అసంఖ్యాక క్రైస్తవ మతావలంబకులు జిజ్ఞాస, ఆత్మస్థయిర్యం పెంచుకున్నారు. మతం చెప్పే ప్రతి అంశాన్ని గుడ్డిగా నమ్మే అలవాటును మానుకొన్నారు. దీంతో చర్చిలో పేరుకుపోయిన అవాంఛనీయ లక్షణాల పట్ల ఏహ్యభావాన్ని, తృణీకారాన్ని పెంచుకొన్నారు. ఇది క్రైస్తవమత చీలికకు దారితీసింది. కాథలిక్ మతం పట్ల నిరసన (PROTEST) మొదలై, ప్రొటెస్టెంట్ మతశాఖగా రూపుదిద్దుకొంది. ఈ తిరుగుబాటు ఒకే ఒక శాస్త్రీయ ఆవిష్కరణతో సాధ్యమయింది. అది జరిగిన క్రమంబెట్టిదనిన...

కాథలిక్ మత అధికారవర్గానికి పోప్ ఆధినాయకుడు. పోప్‌ను ఆదర్శ మతగురువుగా క్రైస్తవులందరూ అంగీకరిస్తారు. కానీ 15వ శతాబ్దానికి చర్చిలో ఎన్నో దుర్లక్షణాలు చోటు చేసుకొన్నాయి. వీటిని క్రైస్తవమత ముఖ్యులెందరో ఖండిస్తూ వచ్చారు. 14వ శతాబ్దంలో జాన్ విక్లిఫ్, బోహీమియాకు చెందిన జాన్‌హస్ తిరుగుబాటు చేశారు. వెల్లువెత్తిన ఈ నిరసనలకు అసలు సిసలు జీవాన్నిచ్చింది మాత్రం పునరుజ్జీవనోద్యమం ముందుకు తెచ్చిన మానవతావాదం. దౌర్జన్యాన్ని ఎదిరించే గుండె నిబ్బరాన్ని మంచీ చెడులను విడమర్చి చూడగల హేతువాద దృక్పథాన్ని ఈ మానవతావాదం సమకూర్చింది. కాగా ఈ ఉద్యమానికి గొప్ప చేయూత అచ్చుయంత్రం రూపంలో లభించింది. ఎలాగంటే ? గుటెన్ బర్గ్ అనే శాస్త్రజ్ఞుడు కనుగొన్న అచ్చుయంత్రం అప్పుడే వ్యాప్తిలోకి రానారంభించింది. దాని సాయంతో క్రైస్తవుల మత గ్రంథం "బైబిల్" అచ్చయింది. నిజానికి క్రైస్తవం ఏం చెపుతున్నదీ, తమ జీవితాలను ఏవిధంగా మలుచుకోవాలన్న సిద్ధాంతాలు ఇందులో వున్నాయి. ఇప్పుడవి చాలా సులభంగా, ఎంతో వివరంగా ప్రజల ముందుకు వచ్చాయి. దీంతో బైబిల్ సూత్రాలకు విరుద్ధంగా మతాధిపతులు, ముఖ్యంగా అధినాయకుడు పోప్ గడుపుతున్న విలాస జీవితం, చర్చి సంస్థల్లో నెలకొన్న అవినీతి, బంధుప్రీతి, పక్షపాతం, ధనార్జనల పట్లను ప్రజలు అసహ్యించుకొన్నారు. దీనికి తోడుగా, అదే చారిత్రకదశలో తలెత్తుతున్న మధ్యతరగతి వర్గం (విద్యా, వాణిజ్యవర్గాలు), దేశాధినేతలు కలసి, చర్చి అధికారాలకు గండి కొట్టి, తమ స్వతంత్రతను చాటుకోవాలని ఉబలాటపడ్డారు. అంతేగాక పాపపరిహార పత్రాలను మార్కెట్లో సరుకుల్లాగ విరివిగా పోప్ అమ్మడం మొదలెట్టారు. చేసిన పాపాల నుండి, పరిహారం పొందడానికి, ప్రక్షాళనం గావించుకొని మరణానంతరం, దైవసన్నిధి చేరడానికి, ఈ సర్టిఫికెట్లను కొని, వాడుకోవచ్చునని ప్రచారం చేశారు. చర్చి చేపట్టిన ఈ అవినీతి చర్య, మరింత గర్హనీయమైంది. సంస్కరణోద్యమానికి జర్మనీ దేశస్థుడు, మార్టిన్ లూథర్ నాయకత్వం వహించాడు. అంతకు ముందు చర్చికి ఎదురు తిరిగిన జాన్‌హస్‌ను చర్చి సజీవదహనం చేసింది. అయినా తిరుగుబాటుకు మార్టిన్ లూథర్ వెనుకాడలేదు. రైతు కుటుంబంలో పుట్టిన లూథర్ తిరుగుబాటు బావుటా ఎగరేశాడు. దీనికి ప్రతిగా పోప్ మార్టిన్ లూథర్‌ను వెలివేసి, పవిత్ర రోమన్ సామ్రాజ్యం నుండి బహిష్కరిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశాడు. పోప్ పంపిన శ్రీముఖాన్ని లూథర్ బహిరంగంగా మార్కెటు కూడలిలో తగలబెట్టాడు.

ఈ క్రమంలో అచ్చుయంత్రాన్ని కనుగొనడం, బైబిల్ గ్రంథం అచ్చుకావడం, కాథలిక్ చర్చిలో తిరుగుబాటు వచ్చి ప్రొటెస్టెంట్ మతం, ఆ తర్వాత దాంట్లో కాల్వినిజం, జ్వింగ్లీజం లూథరానిజమ్ లాంటి శాఖలెన్నో తలెత్తడం జరిగింది. అచ్చుయంత్రం క్రైస్తవమత చరిత్రలోనే పెద్ద టర్నింగ్ పాయింట్.

*

జి.ఎల్.నరసింహారావు
హైకోర్టు న్యాయవాది

డబ్బు తిరిగి ఇవ్వట్లేదు

నేను నా పొలం అమ్మాను. రెండు లక్షలొచ్చాయి. కొంత మంది ప్రభుత్వోద్యోగులకు రెండురూపాయల వడ్డీకి అప్పుగా ఇచ్చాను. ప్రోనోటు రాయించుకున్నాను. ఇప్పుడు డబ్బు ఎవ్వరూ తిరిగివ్వడం లేదు. నేను నిరుద్యోగిని. కేబుల్ ఆపరేటరుగా పని చేస్తూ బతుకుతున్నాను. నా సంపాదన నా కుటుంబావసరాలకే సరిపోవడం లేదు. ఈ పరిస్థితిలో స్టాంపు డ్యూటీ, ఖర్చులు భరించి లాయరును పెట్టుకొని కేసు వేసే శక్తి లేదు. నాకున్న ఒక ఆధారమూ ఆ డబ్బే. దావా వెయ్యకపోతే నేను పూర్తిగా నష్టపోతాను. నేనిపుడేం చేయాలి? కోర్టులు నాకేమైనా సహాయం చేస్తాయా? ఉచితంగా నా దావాలు వేసి, వసూలయిన తరువాత వాటి నుండి స్టాంప్ డ్యూటి, లాయర్ ఫీజు ఖర్చులు కోర్టులో తీసుకొనే అవకాశం ఉందా? దయచేసి తెలియజేయగలరు.

గోపాలరావు, నెల్లూరు.
కె.సుబ్రహ్మణ్యం, కోవూరు

మీరు వడ్డీ వ్యాపారం చేయదలచినప్పుడు కచ్చితంగా మనీలెండర్ లైసెన్సు తీసుకోవలసి ఉంటుంది. అలా తీసుకోని వడ్డీ వ్యాపారం చేయాలి. మీరు కోర్టులో దావా వేయాలి. అంటే స్టాంపు డ్యూటీ తప్పనిసరి. మీకు ఆ డబ్బులు తప్పితే వేరే ఏ ఆధారమూ లేదని, ఆ డబ్బులు తప్పితే మీకు ఇంకా ఎటువంటి రాబడీ లేని స్థితిలో ఉన్నారని నిరూపించుకోగలుగుటకు పాఫర్ పిటిషన్ తీసుకోవచ్చు. అలా కోర్టు పాఫర్ పిటిషన్ అనుమతించే అవకాశం ఉంటుంది. లేదా జిల్లా లీగల్ ఎయిడ్ వారిని సంప్రదించండి.

"రీ పోలింగ్" పెట్టమని ఏ కోర్టులో అడగాలి

ఈ మధ్య కాలంలో జరిగిన మున్సిపల్ ఎన్నికలు జరిగాయి. ఒక వార్డులో పోటీ చేసిన ఇద్దరు అభ్యర్థులకు సమానంగా ఓట్లు వచ్చాయి. ఎన్నికల అధికారులు మా అభ్యర్థి అంగీకారం, సంతకం లేకుండా డ్రా తీశారు. మరొక అభ్యర్థి గెలుపొందారు. మా అభ్యర్థి అంగీకారం లేదు కాబట్టి మేం కోర్టును ఆశ్రయించవచ్చునా? అలా చేస్తే మాకు న్యాయం చేకూరుతుందా? అలాంటి దావా వేయడానికి మేము ఏ కోర్టును ఆశ్రయించాలి ? మళ్లీ ఎన్నికలు జరపమని "రీ పోలింగ్" పెట్టమని కోర్టు తీర్పిస్తుందా? ఈ విషయాలన్నీ మాకు తెలీదు. కావున వివరంగా సమాదానం రాయగలరు.

సన్ని, మాధవరావు
ఇల్లందు మున్సిపాలిటి
ఖమ్మం జిల్లా.

ఇద్దరు అభ్యర్థులకు సమానంగా ఓట్లు వచ్చాయి. కావున ఎన్నికల అధికారులకు డ్రా తీయడం మినహా వేరే దారిలేదు. దానిని మీరు కూడా పాటించాలి. దీనికి మీరు సమ్మతి తెలుపక 'రీ ఎలక్షన్ పెట్టమని అడిగారు. మీరు సంతకం పెట్టని కారణంగా అన్యాయం జరిగిందని తీర్పు చెప్పరు. మీరు దావా వేయాలి అనుకుంటే ఎలక్షన్ పిటిషన్ మీ దగ్గరలోని కోర్టులో వేయవచ్చును. న్యాయమనిపిస్తే మళ్లీ ఎలక్షన్‌లు పెట్టమని తీర్పు చెప్తారు. కానీ మీ విషయంలో అది కనిపించుట లేదు.

అమ్మా... పారిపోదామనా ... ?

దొంగని కోర్టుకు తీసుకువెళ్తున్నాడు. కానిస్టేబుల్ కనకరత్నం వర్షం మొదలైంది. "మీరలా చెట్టు క్రింద కూర్చోండి సార్. నేనింటికెళ్ల గొడుగు తీసుకుని వస్తా" అన్నాడు దొంగ "అమ్మా పారిపోదామనుకుంటున్నావా ? ఆ పప్పులేం ఉడకవ్. నువ్వే చెట్టు క్రింద కూర్చో. నేను స్టేషన్ కెళ్లి గొడుగు పట్టుకొస్తా" అంటూ దొంగను వదిలి వెళ్లాడు కనకరత్నం.

- పెండెం జగదీశ్వర్

ఇంటి సంగతులు

> అటు మనసుకూ, ఇటు శరీరానికీ వయసు రానివ్వరు. అటు సూర్యుడు ఇటు పొడిచినా... తన పనులను మాత్రం సమయం ప్రకారం పద్ధతిగా చేసుకుంటూనే ఉంటారు"

ఇంత చలిలోనూ...

పి. జ్యోతి

"అత్తయ్యగారూ! మావయ్యగారు లేరేంటి? ఇంత తెల్లవారుఝామునే ఎక్కడికండీ వెళ్లారు. అసలే చలి గడగడ వణికిస్తోంది" అంది లహరి అత్తగారి గదిలోకొచ్చి.

"నీకు తెలియనిదేవుందమ్మా. ఆయన మార్నింగ్ వాక్‌కు వెళ్లుంటారు" అన్నారు కావేరి గారు కోడలివైపు తిరిగి చూస్తూ.

"బాబోయ్! ఇంత చలిలోనా...! మీ అబ్బాయిని చూడండి ఎలా ముసుగుతన్ని పడుకున్నారో... ఆఫీసు టైమౌతోంది లేవండీ... అని లేపలేక ఛస్తున్నాను" అంది లహరి భర్తమీద అత్తగారికి పిర్యాదు చేస్తూ.

"పడుకోనీలేమ్మా! మీ మావయ్యగారికంటే వ్యాయామం, నడక ప్రతిరోజూ తప్పనిసరి. 70 ఏళ్లొచ్చినా వీటిని మానలేదు. బోల్డుమంది నౌకర్లున్నా తన పనులన్నీ స్వయంగా చేసుకుంటారు. ఏదైనా అవసరమొచ్చి గోడలు, చెట్లు ఎక్కాలన్నా పనివాళ్లను పిలవరు. తనే చకచకా ఎక్కేస్తారు. మొన్నోసారి చింతచెట్టెక్కి చిగురు కోశారు" అని చెప్పుకున్నారు కావేరి గొప్పగా భర్త గురించి.

"నిజంగానా?" ఆశ్చర్యంగా అంది లహరి.

"అవునమ్మా! అటు మనసుకూ, ఇటు శరీరానికీ వయసు రానివ్వరు. అటు సూర్యుడు ఇటు పొడిచినా... తన పనులను మాత్రం సమయం ప్రకారం పద్ధతిగా చేసుకుంటూనే ఉంటారు" అన్నారు.

అవును మరి... కాలాలు మారుతూనే ఉంటాయి. అది సహజం. ప్రతి దానికీ కాలం, ఖర్మం అంటూ కూర్చుంటే ఎలా? ఏ కాలానికి తగిన జాగ్రత్తలు ఆ కాలానికి తీసుకుంటూ మన విధులను మనం నిర్వర్తించాలి. అందుకే ఈ వయసులోనూ మావయ్యగారు అంత ఆరోగ్యంగా ఉన్నారు. చలికాలం బయటికెళ్లేటప్పుడు ఆయన కొన్ని జాగ్రత్తలు పాటిస్తారు. అవేంటో తెలుసుకోవాలనుందా...

ప్రస్తుతం చలికాలం కాబట్టి ఉదయం బయటికెళ్లేటప్పుడు చెవుల్లోకి, ముక్కుల్లోకి చల్లగాలి తగలకుండా స్కార్ఫ్‌లు, మఫ్లర్లు, స్వెటర్లు వేసుకోవాలి. ఇవన్నీ రెండు జతలుంటే మంచిది. ఒక్కటి ఉతికినా... మరోటి ఉంటుంది వేసుకోవడానికి.

ఈ శీతాకాలం శరీరం పేలుతూ ఉంటుంది. సబ్బు వాడకాన్ని తగ్గించాలి. సున్నిపిండిని ఉపయోగించాలి. స్నానానికి ముందు ఒంటికి ఏదైనా నూనె రాయాలి. గోరువెచ్చని నీటితో స్నానం చేయాలి. దీనివల్ల శరీరం మృదువుగా ఉంటుంది. పెదాలకు, పాదాలకు కోల్డ్‌క్రీములు రాసుకోవాలి. శరీరానికి వేడినిచ్చే ఆహార పదార్థాలు తీసుకోవాలి. బ్రేక్‌ఫాస్ట్‌గా పొంగలిని తీసుకుంటే మంచిది. బియ్యంలో పెసరపప్పు, మిరియాలు, జిలకర, బెల్లం, నెయ్యి వేసి వండుకోవాలి.

ఫ్రిజ్‌లో పెట్టిన పదార్థాలను అలానే నేరుగా తీసుకోకూడదు. మామూలు స్థాయికి వచ్చిన తరువాతే తీసుకోవాలి. ఐస్‌క్రీమ్స్, కూల్‌డ్రింక్స్ తీసుకోకుండా ఉంటే మంచిది. వీటి వల్ల జలుబు, దగ్గు వచ్చే అవకాశముంది. ఇంట్లో పసిపిల్లలుంటే వారికి చల్లగాలి తగలకుండా జాగ్రత్త తీసుకోవాలి. పదార్థాలు వేడిగా ఉన్నప్పుడే భోజనం చేస్తే మంచిది. మళ్లీ మళ్లీ వేడి చేసే అవసరముండదు. ఇలా కాలానికనుగుణంగా జాగ్రత్తలు తీసుకోవాలి. దీనివల్ల ఇంట్లోని వారందరూ ఆరోగ్యంగానూ, ఆనందంగానూ ఉండొచ్చు.

✲

నేర్చుకుందాం...రా!

సండే డెస్క్



డిజైన్ ఇలా వేయండి

మీరు వేయాలనుకున్న డిజైను సరైన ఆకృతిలో కుదరటం లేదా? చూసిన డిజైనుకు, చిత్రీకరించిన తర్వాత డిజైనుకు చాలా తేడా ఉంటోందా? అయితే ఎలాంటి డిజైనునైనా సరైన ఆకృతిలో... అందంగా తీర్చిదిద్దుకోగల ఈ పద్ధతులు మీ కోసమే... ఇందుకు కావాల్సినదల్లా : ఎంబ్రాయిడరీ రింగ్ ట్రాన్స్ఫర్ పేపర్, బట్టర్ పేపర్, వివిధ రంగుల కార్బన్ పేపర్లు, కిరోసిన్‌లో ముంచిన చాక్‌పీస్, పెన్సిల్ గుండు సూది, సీలింగ్ వ్యాక్స్

డైరెక్ట్ డ్రాయింగ్ పద్ధతి

మీకు డ్రాయింగ్ నైపుణ్యం ఉందా? అయితే ఈ పద్ధతి మీకు సరైనది. మొదట మీకు నచ్చిన డిజైన్ ఎన్నుకోండి. ఎంబ్రాయిడరీ రింగ్స్ మధ్య ఉండే బట్ట మీద ఆ డిజైన్ పెన్సిల్‌తో లైట్‌గా గీయండి. ఆర్గండి, జార్జెంట్, ఫుల్‌వాయిల్, నైలాన్ చీరలు డైరెక్ట్ డ్రాయింగ్ పద్ధతికి మరింత అనుకూలంగా ఉంటాయి.

మీరు డ్రాయింగ్ చేయలేనప్పుడు ఈ కింది పద్ధతులను ఉపయోగించొచ్చు.

ట్రాన్స్ఫర్ పేపర్ పద్ధతి

మొదట ట్రాన్స్ఫర్ పేపర్‌ను తీసుకోండి. దాన్ని డిజైన్ మీద ఉంచండి. సీలింగ్ వ్యాక్స్ ద్రవరూపాన్ని సంతరించుకునే వరకూ వేడి చేయండి. ఒక బ్రష్ తీసుకొని డిజైన్ అవుట్‌లైన్ సీలింగ్ వ్యాక్స్‌తో వేయండి. డిజైన్ అవుట్‌లైన్ ఉన్న పేపర్‌ని బట్టమీద ఉంచండి. ఐరన్ బాక్స్‌తో వేడి చేయండి. అప్పుడు పేపర్ మీదున్న డిజైను బట్ట మీదకు ట్రాన్స్ఫర్ అవుతుంది. డిజైన్ పూర్తయ్యే వరకు సీలింగ్ వ్యాక్స్ వేడిగానే ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి.

కార్బన్ పేపర్ పద్ధతి

ఎరుపు, పచ్చ, పసుపు, నీలి, తెలుపు కార్బన్ కాపీల సహాయంతో ఈ పద్ధతిలో డ్రాయింగ్ చేస్తారు. వీటిని డిజైన్ చేయదలచుకున్న బట్టమీద ఉంచండి. కార్బన్ పేపర్ కదలనివ్వకండి. దానిమీద డిజైన్ ఉంచండి. కార్బన్ పేపర్ తాలూకు రంగు బట్టలకు అంటుకునే విధంగా ఏర్పాటు చేసుకోవాలి. ఇప్పుడు డిజైన్ పెన్సిల్‌తో ట్రేసింగ్ చేయండి. డిజైన్ ట్రాన్స్ఫర్ అయ్యిందో, లేదో అని అనుమానిస్తున్నారా? అయితే ఓ అంచున కార్బన్ పేపర్‌ని ఎత్తి పరిశీలించండి. డార్క్ కలర్ బట్ట మీద తెలుపు లేదా పసుపు కార్బన్ కాపీలు, లైట్ లేదా వైట్ కలర్ బట్టల మీద నీలిరంగు కార్బన్ కాపీలు వాడండి.

బటర్ పేపర్ పద్ధతి

ఓ బటర్ పేపర్ షీట్ తీసుకోండి. దాని మీద డిజైన్ ట్రేస్ చేయండి. సన్నని సూది తీసుకుని డిజైన్ అంచులను తాకుతూ ఉండేలా రంధ్రాలు చేయండి. ఈ రంధ్రాలు ఒకదానికోటి దగ్గరగా ఉండాలి. ఇప్పుడు ఈ పేపరును బట్ట పై ఉంచండి. స్మూత్‌గా ఉండే భాగాన్ని బట్టకు పై భాగంలో ఉండేలా చూసుకోండి. రంగు చాక్‌పీసును తీసుకొని, దాన్ని కిరోసిన్‌లో ముంచండి. ఆ చాక్‌పీస్‌తో హోల్స్ మీదుగా గట్టిగా రుద్దండి. ఇప్పుడు పేపరును తీసేయండి. చెల్లా చెదరుగా పడివున్న పౌడరును విదిలించండి. ఒక పెన్సిలుతో చుక్కలు పడిన ప్రాంతాన్ని కలపండి. ఇప్పుడు మీరు కోరుకున్న డిజైను బట్ట మీదకు ట్రాన్స్ఫర్ అయిపోతుంది.



పె...ద్ద... పేరు

" మీ పేరేమిటి డాక్టర్" అడిగాడు పుల్లయ్య

"రవి" చెప్పాడు డాక్టర్

"మరి మీరీ సిటిలో పెద్ద పేరున్న డాక్టరని మా అబ్బాయి చెప్పాడే !" ఆశ్చర్యపోతూ అన్నాడు పుల్లయ్య.

\- పెండెం జగదీశ్వర్

సీరియల్

మూలం : అనుపమా నిరంజన

అనుసరణ : వి. నాగరత్న

గాలవుడి గురుదక్షిణ పుణ్యాన మాధవిపొందు దక్కిన ఉశీనరుడు యుద్ధంలోనూ ఆరితేరినవాడే. పొరుగురాజ్యంపై దండెత్తాడు. ఆ యుద్ధంలో ఓడిన మాహిష్మతి రాజు, ఉశీనరుడికి భారీగా కప్పంతో పాటు తన కూతుర్ని కూడా ఇస్తానన్నాడు. యుద్ధంలో సైనికులు ఎంతో మంది చనిపోగా, ఉశీనరుడికి వజ్రవైఢూర్య ధనసంపత్తులతో పాటు మరో రాకుమారి కూడా దక్కబోతోంది.

మాధవి

(23వ భాగం)

పెళ్ళి ప్రస్తావన రాగానే ఉశీనరుడి ముఖంలో చిరునవ్వులు చిందులేశాయి.

'ఎందరు భార్యలున్నా ఇంకొకరికి చోటుంటుంది కాబోలు... ఈయనగారి పేరు ఉశీనరుడికి బదులు పుష్పకనరుడంటే బాగుండేది' అని వ్యంగ్యంగా అనుకుంటూనే పైకి మాత్రం తానూ నవ్వాడు సేనాపతి.

"వరుడి ఇంట్లో పెళ్ళిచేయడం మా సంప్రదాయం. ఒక నెల గడువివ్వండి, అన్నీ సమకూర్చుకుని, శుభముహూర్తం నిశ్చయించి అమ్మాయిని తీసుకుని భోజరాజ్యానికి వస్తాం" అన్నాడు మాహిష్మతిరాజు.

ఉశీనరుడు అందుకు ఒప్పుకున్నాక మాహిష్మతి వెళ్ళిపోయాడు.

"చనిపోయిన వీరులందరికీ శవసంస్కారం చేయండి, అలాగే గెలిచినవారికి కానుకలు ప్రకటించండి" అంటూ సేనాపతికి పురమాయించాడు ఉశీనరుడు.

ఎండుకట్టెలు పోగుచేసి శవాలన్నిట్నీ వరుసగా పేర్చి దహనంచేశారు. ముందే రక్తమాంసాల నీచుకంపుతో బాధపడుతున్నవారికి శవాలు కాలుతున్న వికారపువాసనకు కడుపులో దేవినట్లే వుంది. కొందరు వాంతులు చేసుకున్నారు. కొందరు స్మశానవైరాగ్యానికీ గురయ్యారు. ఎవరికివారే అక్కణ్ణించి ఆమడదూరం పారిపోవాలని తలుస్తూ గుర్రాలను, రథాలను దౌడుతీయించారు.

రాజ్యంలో ప్రవేశించగానే రాజుకు ఘనస్వాగతం లభించింది. 'జయీభవ, విజయీభవ, దిగ్విజయీభవ' అనే నినాదాలు మిన్నుముట్టాయి.

తిరిగొచ్చిన సైనికుల బంధుమిత్రులు సంతోషించారు. రానివారి తల్లిదండ్రులు, భార్యాపిల్లలు రోదించారు.

మరోనెలలో మాహిష్మతిరాజుగారమ్మాయితో జరగబోయే ఉశీనరుడి పెళ్ళి గురించి కూడా చెవులు కొరుక్కున్నారు. ఇవన్నీ మాధవిచెవిన పడుతూనే వున్నాయి. దేనికీ తాను చేయగలిగిందేమీ లేదన్న నిర్వేదంతో నిస్తేజంగా వుండిపోయింది.

తాను యుద్ధానికి వెళ్ళేపుడు రక్తతిలకం దిద్దేందుకు రాకపోగా కనీసం విజయం సాధించి వచ్చాకైనా ప్రశంసలు తెలియజేయని మాధవిపై ఉశీనరుడికి బాగానే కోపవెుచ్చింది. అపురూపసౌందర్యరాశి కనుక పళ్ళు నూరుకుని

"నల్లరంగు చెవి ఉన్న తెల్లటి గుర్రాలు ఎనిమిది వందలు నాకు గురుదక్షిణగా కావాలి" అన్న గురువు గారి కోరికను ఆ శిష్యుడెలా తీర్చాడో ఈ సీరియల్‌లో చదువుతున్నారు.

ఊరుకున్నాడు. అయితే ఆమె అంతఃపురానికి మాత్రం వెళ్ళలేదు. మాధవి అది గుర్తించినా మంచిదేననుకుంది.

అనుకున్న పెళ్ళిరోజు రానేవచ్చింది. మాహిష్మతిరాజు అంగరంగవైభోగంగా పెళ్ళి జరిపాడు. బంగారునాణాలు, పట్టుపీతాంబరాలు, రథాలు, గుర్రాలు - ఇలా ఎన్నింటినో సమర్పించాడు. ఇక పెళ్ళికూతురు మహిమ బ్రహ్మాండమైన నగలతో, ఖరీదైన వస్త్రాలతో, కాళ్ళూచేతులకు గోరింటాకుతో, చూడచక్కటి పూలజడతో అలరారుతోంది. ఆమె కనుముక్కుతీరు బాగానేవున్నప్పటికీ నల్లటిపిల్లంటూ అందరూ ముక్కువిరిచారు. అప్పటివరకూ వున్న రాణీవాసపు స్త్రీలందరిలో ఈ అమ్మాయే నాసిగా వుందని, ముఖ్యంగా మాధవి అందంముందు బొత్తిగా దిగదుడుపని చెప్పుకున్నారు.

ఇక ఉశీనరుడిలో పెళ్ళికళ ఉట్టిపడుతోంది. పట్టలేనంత సంబరంగా కనిపిస్తున్నాడు. మంత్రి, సేనాపతులతో పెళపెళానవ్వుతూ మాట్లాడుతున్నాడు. 'ఎందరు రాణులున్నా మరోపెళ్ళికోసం ఎదురుచూసేవాడే రాజుకాబోలు', 'ఆహా, జీవితంలో ఇదే మొదటిపెళ్ళయినట్లు ఏం సంతోషం?!', 'దండిగా కట్నమిస్తే కురూపినైనా చేసుకునేట్లున్నాడు' - ఇలా ఎవరికి తోచినట్లు వాళ్ళు అనుకున్నారు.

'ఎందరు భార్యలున్నా సంతృప్తిచెందడు, ఎప్పటికప్పుడు కొత్తరుచులు కావాలి' అని ఉక్రోషంగా పళ్ళు నూరుకుంది మహారాణి.

ఇక్కడ పెళ్ళివేడుకలు హోరెత్తుతోంటే ఇవేం పట్టని మాధవి వెల్లకిలా పడుకుని కళ్ళు మూసుకుంది. 'నాతో సంపర్కం పెట్టుకుని నాలుగునెల్లయినా కాలేదు, మరోపెళ్ళి చేసుకుంటున్నాడు. 'అపురూప సౌందర్యం, ముల్లోకాలూ వెతికి చూసినా ఇంత అందం దొరకదు. నీవల్ల దొరికిన ఆనందం అంతాఇంతాకాదు' అంటూ చెప్పిన కబుర్లేమయ్యాయో? తాను గత్యంతరంలేక వీళ్ళతో గడపడాన్నే హేయంగా భావిస్తోంది. కానీ ఈ రాజులు నీతినియమాలనేవి లేకుండా ఇందరిందరు స్త్రీలతో సంబంధాలు ఎలా పెట్టుకోగల్గుతారు? బహుభార్యాత్వం తప్పుకాదా? సంస్కారహీనులు దీన్నో ఆచారంకింద మార్చారు? ఈ దుర్మార్గాన్ని ఎవరూ ఖండించరా? తన సంగతి వదిలేస్తే రాజలాంఛనాలతో భార్యలైన మహారాణి మొదలైనవాళ్ళకి ఉక్రోషం కలగదా? ఇదేదో సహజమైన విషయంలా ఎలా సహించగల్గుతారు? ఛఛ.. ఈ అవినీతిపరులను తల్చుకుంటే అసహ్యమేస్తోంది' అనుకుంది.

✧ ✧ ✧

తలస్నానంచేసిన మాధవి ఉద్యానవనంలో కూర్చుని జుట్టు ఆరబెట్టుకుంటోంది. బాగా పొడుగ్గా, ఒత్తుగా వుండటాన జుట్టు ఓపట్టాన ఆరదు. చలిగా వుండటంతో ఆ ఎండపొడ ఒంటికి హాయిగా తాకుతోంది.

అవ్వ, చారునేత్ర, కమలముఖి, అటు తర్వాత కనకాంబరి, మేఖల అందరూ గుర్తొచ్చారు. ఏవేవో స్మృతులు కళ్ళముందు కదలాడగా ప్రస్తుతాన్ని మరచి కలల్లో తేలింది. తనలో తానే నవ్వుకోవడం చూసిన మహారాణిగారి పిల్లలిద్దరూ పకపకా నవ్వారు. ఆ శబ్దానికి మాధవి ఈలోకంలోకి వచ్చి తేరిపారచూసింది.

వెంటనే వాళ్ళని గుర్తుపట్టి స్నేహంగా నవ్వి, దగ్గరగా రమ్మని చేయి చాచింది.

ఆ పిల్లలిద్దరూ పరస్పరం ముఖముఖాలు చూసుకుని ఒకడుగు వెనక్కేశారు. అది చూసి "నేను మీ పిన్నినే కదా, రండి నాతో, లోపలికొస్తే పప్పులు పెడతాను" అంది.

"అమ్మ నువ్వు మంచిదానివి కావని చెప్పింది, నీతో మాట్లాడొద్దంది"

ఆ మాటకు నొచ్చుకున్నా "నా ముఖం చూడండి, నేను చెడ్డదాన్లా వున్నానా? నాతో కాసేపు మాట్లాడ్తే మీకే తెలుస్తుంది, నేనెలాంటిదాన్నో... రండి" అంది మాధవి.

పిల్లలు క్షణం ఆలశ్యం చేయకుండా దరిచేరి "నువ్వు చాలా బాగుంటావు పిన్నీ" అన్నారు.

అద్భుతమైన తెలుగు తనంతో అలరారిన తెలంగాణా గ్రామసీమల
కుటుంబ కథా నేపథ్యంతో మరో సీరియల్ ప్రారంభం త్వరలో...

"దాందేముంది, పైపై అందం కాదమ్మా కావలసింది... మనసు మంచిదయ్యుండాలి"

అంత పెద్దమాటలు అర్థంచేసుకోలేని వయసు కనుక బదులు చెప్పలేక మౌనంగా అనుసరించారు.

దాసీలు తాను తినడంకోసం అమర్చిన డబ్బాల్లోంచి జీడిపప్పు, బాదంపప్పు, ఎండుద్రాక్ష, అంజీరాలు మొదలైనవి పిల్లలకిచ్చింది మాధవి. వాళ్ళు అమాయకంగా కబుర్లుచెప్తూ, అవి తింటోంటే దూరమైన తన కొడుకులు ప్రతర్దనుడు, వసుమంతులను తల్చుకుని బాధపడింది. ఎక్కడికక్కడ ఓ బిడ్డనికంటూ వదిలేసివస్తోంది. బిడ్డ పుట్టేవరకూ ఇష్టంలేని కలయిక, ఆపైన మమకారాలమూటని చూసుకుని మురిసిపోలేని నిస్సహాయత. అంతకంటే తన శరీరంలో ఓ ఖండాన్ని కోసివ్వమన్నా ఫరవాలేదు.

పిల్లలకు అజీర్తిచేస్తుందని మహారాణి జీడిపప్పులాంటివేమీ పెట్టనందున వారు పూర్తి స్వేచ్ఛను అనుభవిస్తూ ఆనందంగా తింటున్న సమయంలో రాణీగారి దాసి అది చూసి "వద్దు, వద్దు, తినకండి" అంటూ పరుగులాంటి నడకతో అక్కడికొచ్చింది. అది గమనించిన పిల్లలు పప్పులెక్కడ చేజారిపోతాయోనని గబుక్కున నోట్లో వేసేసుకున్నారు.

దాసి ఎందుకు తిన్నారని మొత్తుకుంటుంటే "తింటే ఏమైంది, నేనే ఇచ్చాను" అంది మాధవి.

"ఇక్కడేమైనా తిన్నట్లు తెలిస్తే రాణీగారు నా ప్రాణం తీస్తారు" అంటూ తన చీరకొంగుతో ఇద్దరినోళ్ళూ తుడిచి దాసీ పిల్లల్ని లాక్కుని వెళ్ళింది. క్షణంలో మాధవి ఆనందం కాస్తా ఆవిరైపోయింది. 'ఆవిడకి తనమీదెందుకో కోపం, తాను పిల్లలతో చనువుగా వుండకూడదని కాబోలు' అని బాధపడింది.

ఉన్నట్లుండి వర్షం ప్రారంభమై రెండురోజులపాటు ధారాపాతంగా కురిసింది. మూడోరోజు ఉదయాన్నే మహారాణి తన చెలికత్తెలు, దాసీలతో కలిసొచ్చి "నేను భయపడుతున్నంత పనీ జరిగింది.. నా పిల్లలు నీకేం హాని చేశారు? వాళ్ళకెందుకు విషం పెట్టావు? నీకు పుట్టే బిడ్డే రాజు కావాలనే దురాశ నిన్ను పీడిస్తోంది కదూ?!" అంటూ దులపరించి పారేస్తోంటే ఊహించని పరిణామానికి మాధవి అవాక్కయి అయోమయంగా చూసింది.

మొన్న దాసీ 'ఇక్కడేమైనా తింటే రాణీ ఊరుకోదని' చెప్పినా ఇంత దురాలోచన వుందని ఊహించలేకపోయింది. కడుపులో వున్న పిండం ఆడో, మగో ఇంతవరకూ తెలీదు, అలాంటిది తన కొడుకు రాజవ్వాలని కోరుకుంటుందా? ఒకవేళ అలాంటి దురాశే వున్నా ఆ చిన్నారులను చంపేంత నీచురాలిగా ఎలా అనుకోగల్గింది? తాను కనుక అలాంటి దుర్మార్గురాలే అయితే ఇంత మానసికవేదన అనుభవించేదా? జరుగుతున్న వైపరీత్యాన్నే తట్టుకోలేక కుళ్ళికుళ్ళి ఏడుస్తోంటే ఇలాంటి నిందలు కూడానా?' అనుకుని తల్లడిల్లిపోతూ "అంత దారుణంగా మాట్లాడకు అక్కయ్యా, పిల్లల్ని ముద్దుచేశానే తప్ప వాళ్ళకి పెట్టకూడనిదేమీ పెట్టలేదు" అంది.

"ఛ, ఊరుకో, ఇద్దరూ మూసినకన్ను తెరవకుండా పడున్నారు. వాళ్ళకి ఒకటే వాంతులు, జ్వరమూను.. నువ్వు పెట్టింది తినే ఇలా అయ్యారు"

"జ్వరం యాదృచ్ఛికంగా వచ్చుంటుంది, నన్ను నమ్మ..."

"వాళ్ళకేమైనా అయితే నేనూరుకోను జాగ్రత్త"

"చావు ఆలోచనే వస్తే నేను చనిపోతానే తప్ప, ఇంకొకర్ని కల్లో కూడా చంపలేను"

"అలా అయితే చావు, నువ్వూ, నీ బిడ్డా ఛస్తే పీడాపోతుంది"

"వద్దు, నా బిడ్డను శపించొద్దు... ఇదైనా నాకు దక్కాలి..." అని అరుస్తూ చెవులు మూసుకుంది మాధవి.

"పిచ్చిదాన్లా ఎలా అరుస్తోందో చూడు" అని బుసలుకొడ్తూ రాణీ వెనుతిరిగింది.

... ఇంకా ఉంది

కన్నబిడ్డల్ని పోగొట్టుకున్న మాధవిపై మహారాణి వేసిన నిందకు పర్యవసానం ఏవిటి?
మాధవి ఉన్న మానసిక స్థితికి తోడు మహారాణి చేసిన అభియోగానికి నిజంగానే పిచ్చిదయ్యిందా?
ఉశీనరుడి నిరాదరణ, మహిమ అనే మరో రాకుమారి రాక, మహారాణి వేసిన నిందలతో మాధవి ఎలాంటి దుస్థితిని ఎదుర్కోబోతోంది?
రాబోయే సంచికలో...

క్యాంపస్ ఛాట్

కె శివలీల

నెమ్మదిగా కదిలిందా ఆకారం... టక్కుమని కళ్లు తెరిచింది... చుట్టూ పరికించి చూసింది... మెల్లగా లేచింది... ఒళ్లు విరుచుకుంది... ఏవో పుస్తకాలు పట్టుకుంది... నిశ్శబ్ధంగా... అడుగులో అడుగేస్తోంది...



ష్... గప్ చుప్

"మనందరికంటే వీడే అదృష్టవంతుడురా... పరీక్షలున్నాయన్న ఆందోళనే లేకుండా ఎంత బేఫికర్‌గా నిద్రపోతున్నాడో"

ప్రతి అర్థరాత్రీ ఇలా అనుకోవడం వారికి అలవాటే. ఎలాగైతేనేం మరో రెండు గంటలు గడిచాయి. అందరూ నిద్రకుపక్రమించారు. పదినిమిషాలకు... నిద్రలోకి జారుకున్నారు.

మరో ఐదునిముషాలకు... నెమ్మదిగా కదిలిందా ఆకారం... టక్కుమని కళ్లు తెరిచింది... చుట్టూ పరికించి చూసింది... మెల్లగా లేచింది... ఒళ్లు విరుచుకుంది... ఏవో పుస్తకాలు పట్టుకుంది... నిశ్శబ్ధంగా... అడుగులో అడుగేస్తోంది... తలుపు దగ్గరికొచ్చింది. కిర్రుమనకుండా తీసింది... వెలుతురు లోపలికి ప్రవేశించకముందే... బయటికెళ్లింది... వరండాలోని లైట్లన్నీ... ఆర్పేస్తోంది... ఇప్పుడు... ఒక్క స్ట్రీట్ లైట్ వెలుతురు మాత్రమే మిగిలుంది. ఆ వెలుతురులో... కూర్చుందా ఆకారం... పుస్తకాలు తీసింది... 'ఈ ప్రపంచాన్నే మరిచిపోయిందా' అనుకునేంత ఏకాగ్రతగా చదువుతోంది...

కచ్చితంగా ఇదేదో అతీతశక్తే! చదువుకోవాలన్న ఆశ చావక ఇలా..... హలో ఫ్రెండ్స్... మీ ఆలోచనాధోరణికి వెంటనే చెక్ చెప్పండి. ఎందుకంటే... ఈ ఆకారం ఇలాంటి ఏ కోవకూ చెందినది కాదు మరి. మరెవరు? ఓ విద్యార్థి! అవును. 'నా ప్రిపరేషన్ సంగతెవరికీ తెలియకూడదు' అనుకునే ఓ స్టూడెంట్ పడుతున్న తపన. నిజంగా ఇలాంటి వారుంటారా? బియస్సీ విద్యార్థి హిమ శంకర్‌కు ఎదురైన అనుభవాన్ని వింటే మీరీమాట అనరేమో...

"ఆ రోజులు నాకు బాగా గుర్తు. అప్పుడు నేను ఇంటర్మీడియట్ చదువుతున్నాను. ఎగ్జామ్స్ దగ్గరపడ్డాయి. మేమంతా అర్థరాత్రి వరకూ చదువుకుని, పడుకున్నాం. నాకేమో ఎంత ప్రయత్నించినా నిద్రేరాలేదు. ఓ సారి కళ్లు తెరచి చుట్టూ చూశాను. అందరూ గాఢంగా నిద్రపోతున్నారు. అరె... దివాకర్ ఏమయ్యాడు. బాత్రూం కెళ్లాడేమో అనుకున్నాను. కొంచెం సేపు వేచి చూశా. వాడు రాలేదు. ఇక మెల్లగా లేచా. రూం తలుపు తెరిచి బయటికొచ్చా. చుట్టూ కలియ జూశా. వరండాలో లైటు వెలగట్లేదు. కొంచెం దూరంలో కనిపించింది ఓ అస్పష్టమైన ఆకారం... అటువైపు తిరిగి కూర్చుంది. ఒక్కసారిగా హర్రర్ సినిమాలు, పెద్దవాళ్లు చెప్పే దెయ్యాల కథలు జ్ఞాపకమొచ్చాయి. ఆ ఆకారం దగ్గరికెళ్లడానికి ధైర్యం చాల్లేదు. మా స్నేహితులను లేపాను. అందరూ కలిసి అడుగులో అడుగేసుకుంటూ. చిన్నగా ఆ ఆకారాన్ని సమీపించాం. నాలుగడుగుల దూరంలో ఆగిపోయాం. ఆ అలికిడికి ఆ ఆకారం మావైపు తిరిగింది. గట్టిగా అరవబోతూ... ఆగిపోయాం. ఎందుకరవ బోయామంటే... వాడు కూర్చుని ఉన్న కిందవైపు ఓ టేబుల్ ల్యాంప్ పెట్టాడు కదా.... దాని ఫోకస్ వాడి మొహంపై పడి డ్రాక్యులా సినిమా సీన్ గుర్తుకొచ్చింది. మమ్మల్నింతగా భయపెట్టినందుకు ఆ ఆకారం వీపు వాయగొట్టాం. ఇంతకీ ఆ ఆకారం ఎవరిదో చెప్పలేదు కదూ... వాడే మా స్నేహితుడు, క్లాస్ మేట్ దివాకర్ ప్రతి రోజూ మేం పడుకున్న కొద్దిసేపటికి లేచి వరండాలోని లైట్లన్నీ ఆర్పేసి చదువుకునేవాడట. మేం ఒంటిగంట వరకూ చదివి పడుకుంటే... వాడేమో మేం పడుకున్న వెంటనే లేచి చక్కగా చదువుకుని... మేం లేచే సమయానికల్లా ముసుగుతన్ని పడుకునే వాడట" అని తన అనుభవాన్ని గుర్తు చేసుకున్నాడీ విద్యార్థి.

ఇదిలా ఉంటే... హేమకు ఎదురైన అనుభవమింకో తరహాది. "మా క్లాస్‌మేట్స్ కొందరుండే వారు. వారికి బోర్ కొట్టినప్పుడు, రిలాక్సేషన్ కావాలనుకున్నప్పుడు నా రూముకొచ్చేవారు. పదినిముషాల్లో వెళ్లిపోతారా అనుకుంటే... వాళ్లకు చదువుకోవాలని అనిపించే వరకూ నాతో బాతాఖానీ వేస్తూనే ఉండేవారు. నేను చదువుకుంటున్నానన్న విషయాన్ని గమనించనట్లే ప్రవర్తించే వారు" అని చెబుతోంది హేమ.

అవును... ఇలాంటి వాళ్లూ ఉంటారు. వీరి దోవ వీరిదే. ఎదుటివారి భావాలనసలు పట్టించుకోరు. 'వీరినెలా ఎదుర్కోవాలబ్బా...' అని సతమత మౌతున్నారా? ఏముంది టిట్ ఫర్ టాట్. మీకు బోర్ కొట్టినప్పుడు... మరోమారు ఆలోచించకుండా వారి రూంకెళ్లండి. వారితో చక్కగా కబుర్లాడండి. "అలా ప్రవర్తిస్తే ఏం బాగుంటుంది" అనుకుంటున్నారా? వారు మీతో మాట్లాడుతున్నప్పుడు... వారి మాటలకు ఏమాత్రమూ స్పందించకండి. దాదాపు మీ ప్రోబ్లెం సాల్వ్ అయినట్లే. అయినా వారు వారు మారలేదా... 'ఇక దయచేయండి' అని నిర్మొహమాటంగా వారితో చెప్పడమే.

✻

మూడు ఫైట్లూ... ఆరు పాటలు

అంతే...రీళ్లయిపోయాయి!

చందు



రావి కొండలరావు ఒక నిబద్ధమైన నటజీవితంతో ఒక పరిమితమైన గుర్తింపుతోనే కొనసాగారు. అయినా దాని గురించి ఆయనేం బాధా పడలేదు. మరేదో గుర్తింపుకోసం వెంపర్లాడనూలేదు. ఇటీవల మా టీవీలో కన్యాశుల్కం సీరియల్ ప్రసారం ప్రారంభమవడంతో బుల్లితెర దర్శకుడిగా తెలుగువారి కళ్లముందుకు వారంవారం వస్తున్నారు.

యంగ్‌స్టర్స్ కావాలంటూ పొన్నలూరి బ్రదర్స్ వారు ఒక "స్టోరీ డిపార్ట్‌మెంట్"ను పెట్టారు. డి.వి నరసరాజుగారు నన్నక్కడ పెట్టారు. నాకు డైరెక్షన్ అన్నా ఇంట్రస్ట్ ఉంది కాబట్టి సెట్‌లో కూడా పని చేస్తానని అడిగితే ఓకె అన్నారు. ఈ నేపథ్యంలో కమలాకర కామేశ్వరరావుగారి దర్శకత్వంలో ఎన్.టి.ఆర్, అంజలీదేవి నటించిన 'శోభ' చిత్ర దర్శకత్వశాఖలో తొలిసారి పనిచేశాను. ఆరేళ్ళపాటు పలువురు దర్శకుల వద్ద సహాయకునిగా పనిచేశాను. రచయిత అవ్వాలన్న ఆలోచనే లేదు. అయితే నాకు సినిమా రంగం రచన పట్ల ఒక అవగాహన ఉంది. లైట్ బోయ్ దగ్గర నుంచి దర్శక, నిర్మాతల వరకు అందరికీ డైలాగ్స్ నచ్చాలి. 'ఈ డైలాగ్ బాగోలేదు ఇంకోలా రాయి' అంటారు. మార్చి రాస్తే ఇంకా బాగా రావాలంటారు. అదే నాటకాల్లో అయితే నేనే సొంతంగా రాసుకుంటాను కాబట్టి, నన్నెవరూ డిక్టేట్ చేయరు. సినిమారంగానికి వచ్చేసరికి దీనికి భిన్నంగా ఉంటుంది. అందుకనే రచన వైపు వెళ్ళలేదు. జమున, హరనాథ్ హీరో హీరోయిన్లుగా నటించిన 'చల్లని నీడ' అనే ఒక్క సినిమాకి మాత్రమే మాటలు రాశాను. హిందీ సినిమా బేస్ కాబట్టి కష్టంకాదు రాయండని చెప్పి రాయించుకున్నారు. ఆ తర్వాత మళ్ళీ రాయలేదు. పదహారేళ్ళ విరామానంతరం విజయా సంస్థ 'బృందావనం' తీసింది. ఈ చిత్ర ప్రొడక్షన్ వ్యవహారాలన్నీ నేను చూసుకున్నాను. ఈ సంస్థకు చెందిన 'విజయ చిత్ర' అనే సినిమా పత్రికలో నేను 26 ఏళ్ళపాటు పనిచేశాను.

ఫోర్స్ చేస్తే కాదనలేకపోయాను

బృందావనం తర్వాత 'భైరవ ద్వీపం' అనే చిత్రానికి శ్రీకారం చుట్టారు. రచయితలను ఆహ్వానించాము. ఉదయాన్నే ఆఫీసుకు పిలిపించుకుని రాయించుకోవడం విజయా సంస్థ పద్ధతి. రేపొస్తాం... ఎల్లుండొస్తాం... అనేవాళ్ళే కానీ ఏకాగ్రతతో రాద్దామనుకున్నవాళ్ళు ఎవరూ కనిపించలేదు. ఈలోపు దర్శకుడు సింగీతం, నేనూ కథ గురించి చర్చిస్తున్నాం. ఓ రోజు నిర్మాత, దర్శకుడు ఇద్దరూ వచ్చి, "మీరే డైలాగ్స్ రాయండి, మీరైతే ఇక్కడే ఉంటారు కదా. ఎటువంటి ప్రాబ్లమ్ ఉండదు" అన్నారు. ప్రొడక్షన్ పనులు చూసుకుంటూ రచన చేయడం కష్టం కదా అంటే కాదు కాదు అంటూ ఫోర్స్ చేశారు. దీంతో 'భైరవ ద్వీపం', 'శ్రీ కృష్ణార్జున విజయం' చిత్రాలకు మాటలు రాశాను. దర్శకుడు సింగీతం, నేనూ సంప్రదించుకునేవాళ్ళం. ఇంకెవ్వరి జోక్యం ఉండేది కాదు. షూటింగ్ జరుగుతున్నంత సేపూ అక్కడే ఉంటాను కాబట్టి ప్రాబ్లమ్ లేదు. బయటి వాళ్ళకి పనిచేయడంలో స్వతంత్రం తక్కువ ఉంటుంది. ఇప్పుడైతే రైటర్ రాసిచ్చిన తర్వాత ఏమన్నా మార్పు చేయాలంటే రైటర్‌ని సంప్రదించకుండా వాళ్ళే సరిచేసుకుంటారు.

హీరో...హీరో...సర్వం హీరో!

మా కాలంలో నిర్మాతకి దర్శకులు కథ చెప్పేవారు. ఇప్పుడు హీరోకి కథ చెబుతున్నారు. హీరో డామినేషన్ వచ్చేసింది కదా! తనకు అనుకూలంగా పాత్ర వెళితే కథ ఓకే చేస్తారు. నచ్చిందనుకోండి. అతనే ఫలానా నిర్మాత అని చెబుతున్నారు. పాత్రల ఎంపిక ప్రక్రియ కూడా వాళ్లే చేబడతారు. దీంతో తండ్రి, తల్లి పాత్రలు తగ్గిపోతున్నాయి. ఆరు ఫైట్స్‌కు రెండు రీళ్లు, ఆరు పాటలకు మరో రెండు రీళ్ళు అయిపోతాయి. ఇంక ఇతర క్యారెక్టర్స్ ఏముంటాయి? ఉన్నా ఆడుతూ పాడుతూ ఉంటాయి. సినిమాకి ముఖ్యమైంది కథ. ఇప్పుడది పోయింది. ఇప్పుడంతా మూడు ఫైట్లూ...ఆరు పాటలు అయిపోయింది సినిమా అంటే! సినిమాని కొనుక్కోవడానికి వచ్చినవాడు సినిమా కథ ఏమిటని అడగడు. "హీరో ఎవరండి" అని అడుగుతాడు. ఆ హీరో వలన సినిమా ఆడకపోయిందా...లబోదబో దిబోదిబో!!

ఒక ఆఫీస్ బోయ్‌ని నియమించాలంటే ఇంతకుముందు ఎక్కడ పనిచేశావు...నీ అనుభవం ఏమిటి? చదవగలవా? అని అడుగుతాం. ఏ ఉద్యోగానికైనా మినిమమ్ క్వాలిఫికేషన్ ఉంటుంది. దురదృష్టం ఏమంటే సినిమా తీయడానికి ఏ క్వాలిఫికేషనూ అక్కర్లేదు.

*

(వచ్చేవారం కొండలరావు మరికొన్ని కబుర్లు)

మీరూ చక్కటి బొమ్మలు వేస్తారా!

మరైతే ఆలస్యం ఎందుకంట. వెంటనే నల్లటి స్కెచ్ తీసుకుని బొమ్మ వెయ్యండి. తర్వాత మీకు నచ్చిన రంగులు అద్దండి. ఆనక మాకు పోస్ట్ చెయ్యండి. మేం ప్రచురిస్తాం. మా చిరునామా: చిన్నారిచిత్రకారులు, బాలనేస్తాలు, ప్రజాశక్తి, ఫ్లేట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్.

చిన్నారి చిత్రకారులు

పి.తులసీ వెంకట లక్ష్మి, 9వ తరగతి,
ఎస్‌కెవిఆర్‌జిహెచ్ స్కూల్, పెనుగొండ,
పిల్లివారివీధి, ప.గో.



కడలి శ్రీనివాస్, 10వ తరగతి,
ప్రభుత్వ జూనియర్ కళాశాల,
వైరా, ఖమ్మం.

ఆ 12 ఎక్కడ దాగివున్నాయో...

హేయ్ చిన్నారులూ... ఇవాళ మీకు ఓ కఠిన పరీక్ష పెట్టబోతున్నాం. దానికి మీరంతా సిద్ధమేనా! ఓకే. మరైతే పైన ఓ బొమ్మ వుందికదా. అందులో పన్నెండు బొమ్మలు దాగివున్నాయి. వాటిని మీరు వెతికి పట్టుకోవాలి. కాకపోతే వాటి పేర్లను మేమే చెప్తాం. ఇంతకీ ఆ బొమ్మలేంటంటే... **దువ్వెన, ఈక, హృదయం, స్పూను, అరటిపండు, కప్పు, సాసరు, గాలిపటం, చిత్రకారుడు ఉపయోగించే బ్రష్, రంపం, రిస్ట్‌వాచ్, తల,** ఇంకా ఆలస్యం ఎందుకు? పెన్నో, పెన్సిలో తీసుకుని వాటికి సున్నా చుట్టండి.

బాలనేస్తాలు

రంగులేసేద్దాం

వి'చిత్రం'



ఫ్రెండ్స్! పైన కేవలం మీకోసం ఓ బొమ్మను ప్రచురించాం. అందులో తమాషా ఏంటంటే... పక్షుల నీడలు జంతువులను పోలి వుండడం. మరి ఆ పక్షులేవో, ఆ జంతువులేవో కనిపెట్టండి.

కవలలు ఎవరు?



బుజ్జాయిలూ... ఇక్కడ సరిగ్గా ఎనిమిది మంది అమ్మాయిల తలలున్నాయి. తమాషా ఏంటంటే... వీరిలో ఇద్దరు కవలలు. మరి వారెవరో కనిపెట్టండి.

చుక్కల్లో చిక్కినదెవరో!

నేస్తాలూ... ఇప్పుడు మేము చాలా కాలంనాటి సంగతి ఒకటి చెప్పబోతున్నాం. అదేంటంటే... అమెరికన్ ప్రసిడెంట్ అబ్రహాం లింకన్ వున్నాడుకదా. ఆయన చిన్నప్పుడు ఓసారి వేటకెళ్లాడు. తన తుపాకీతో ఓ జీవిని వేటాడాడు. దాంతో పాపం అది గిలగిలా కొట్టుకుని చనిపోయింది. ఈదృశ్యాన్ని చూసి బుల్లి అబ్రహాం చాలా బాధపడ్డాడు. మరెప్పుడూ అలా చెయ్యకూడదనుకున్నాడు. ఇంతకీ అబ్రహాం చిన్నప్పుడు చంపిన జీవి ఏదో తెలుసుకోవాలని వుందా? మరైతే వెంటనే వరుసగా చుక్కలను కలిపెయ్యండి. ఇట్టే తెలిసి పోతుంది. అప్పటికీ తెలీలేదనుకోండి. పుస్తకం తిరగేసి చూడండే.

పది పొరపాట్లేవో కనుక్కోండి

హేయ్ కిడ్స్! పైన ఓ గదిలో మీటింగ్ జరుగుతోంది. దాన్ని ఓ ఆర్టిస్ట్ అంకుల్ చక్కగా గీసి పంపారు. కాకపోతే అందులో పది తప్పులున్నాయి. అవి ఎక్కడెక్కడో కనుక్కోండి చూద్దాం.

27.11.05కు సరైన సమాధానాలు రాసినవారు

ఎస్.విజయ, 8వ తరగతి, జిల్లా పరిషత్ సెకండరీ స్కూల్, చెన్నూర్, వరంగల్. తుర్లపాటి సాంబశివరావు, 6వ తరగతి, జడ్‌పిహెచ్‌స్కూల్, వేల్పూరు, గుంటూరు. టి.వి.ఎల్.నాయక్, శ్రీవాణి విద్యాలయం, జనగాం, వరంగల్. కావూరి పర్వతాలు, 10వ తరగతి, వికాస్ రెసిడెన్షియల్ స్కూలు, గురజాల. కె.హరికిషన్, 7వ తరగతి, శ్రీ సుబోధనా స్కూల్, తెనాలి. ఎన్.శ్రావణ్, 5వ తరగతి, విష్ణుకుండిన నగర్, వినుకొండ. పల్లపు ప్రభుకుమార్, 7వ తరగతి, కొత్తపేట పాఠశాల, గుడివాడ. పి.వాసంతి, 9వ తరగతి, పి.ఆకాష్‌రెడ్డి, 1వ తరగతి, హోలీ ఫెయిత్ స్కూల్, అభ్యుదయ నగర్, అద్దంకి.

వీరి వీరి గుమ్మడిపండు వీరి పేరేమి?



హలో! ఈ వారం వీరి వీరి గుమ్మడి పండులో వచ్చినదెవరో చెప్పకోండి చూద్దాం. ఈయన మన రాష్ట్రం కోసం తన ప్రాణాలనే సమర్పించిన మహనీయుడు. ఇప్పుడు మీ చిన్నారి బుర్రల్లో లైట్ వెలిగినట్టుందే. ఆ... వెంటనే ఓ కార్డు తీసుకుని ఆయన పేరు రాసి పోస్ట్ చెయ్యండే. అంతేకాదు మీ ప్రియమిత్రులతోనూ రాయించండి. మరి మా చిరునామా:

వీరి వీరి గుమ్మడి పండు,
బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్.

4.12.05 సమాధానం:
బి.ఆర్.అంబేద్కర్

అట్టమీది కథ

బి. సుధాకిరణ్

గౌతమబుద్ధుడు నడిచిన నేల... గుంటూరుజిల్లా ధరణికోట, అమరావతి. బోధివృక్షం వద్ద జ్ఞానం పొందిన నెలరోజుల్లోనే సుధర్మ రాజు కోరిక మీద మొదటి కాలచక్ర బోధనలను ప్రపంచానికి వినిపించిన ప్రాంతం ఇది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న బౌద్ధులు తమ జీవితకాలంలో ఒక్కసారైనా చూసితీరాలని తపించిన స్థలమది... రెండు చిన్నగ్రామాలైన అమరావతి, ధరణికోటలు ఇప్పుడు పత్రికల పతాకశీర్షికలకెక్కుతున్నాయి.

బౌద్ధమతంలోని ఒక కీలకశాఖైన మహాయానాలోని మంత్రయాన(తంత్రయాన) విభాగానికి చెందిన బౌద్ధులు ఇక్కడ జరిపే 30వ కాలచక్ర ప్రార్థనలతో ప్రపంచదృష్టి గ్రామాల మీద పడనుంది.

అమరావతి ఆతిథ్యంలో కాలచక్ర

జనవరి ఐదునుండి పదహారు వరకు జరిగే ఈ ప్రార్థనలకు 1.50 లక్షలమంది హాజరవుతారని అంచనా! దలైలామాతో పాటు, పలు ప్రపంచదేశాధినేతలు, విఐపిలు హాజరవుతున్నారు.

"బుద్ధం శరణం గచ్ఛామి... ధర్మం శరణం గచ్ఛామి.... సంఘం శరణం గచ్ఛామి!"... హిందూ మతంలోని కులవివక్షకు, బ్రాహ్మణవర్గ ఆధిపత్యధోరణికి, జంతుబలికి నిరసనగా ఒకప్పుడు భారతదేశంలో ఉవ్వెత్తున ఎగసిన బుద్ధఘోష అది. అణగారిన కులాల వారిని అక్కున చేర్చుకుని బౌద్ధారామాల్లో తనదైన పరిష్కారం చూపడానికి జరిగిన ప్రయత్నమది. మౌర్యరాజుల హయాంలో భారతదేశంలో ఒక వెలుగు వెలిగి, ప్రపంచదేశాలకు పాకిన ఓ కొత్త తాత్విక విధానమది! క్రమేణా పునరైక్యం చెందిన హిందూమత ఆధిపత్యశక్తుల ప్రభావంతో అనేక మార్పులకు, చేర్పులకు లోనై ఎక్కడైతే పుట్టిందో అక్కడే నామమాత్రంగా మారిన మతమది! అదే "బౌద్ధమతం".

బౌద్ధమతంతో పాటే మౌర్యరాజుల కాలంలో దేశవ్యాప్తంగా బుద్ధుని అస్థికలపై నిర్మాణమైన "మహాచైత్యాలు" కాలగర్భంలో కలిసిపోయాయి. వాటిలో అత్యంత ముఖ్యమైనది గుంటూరు జిల్లాలోని అమరావతి. కాల గమనంలో బౌద్ధంతోపాటు ఆ బోధనలు అక్కడినుండి తరలివెళ్ళాయి. కాలగర్భంలో కలసిపోయిన అమరావతి మహాచైత్యం 18వ శతాబ్దంలో జరిగిన త్రవ్వకాలలో వెలుగుచూసింది. ఎప్పుడో పన్నెండేళ్ళకోసారి వచ్చే కృష్ణా పుష్కరాల్లోను, ఏడాదికొకసారి వచ్చే మహాశివరాత్రి సందర్భంగానో పత్రికలకెక్కే అమరావతి, ధరణికోట గ్రామాలు "కాలచక్ర" నిర్వహణతో ప్రపంచవ్యాప్త ప్రాధాన్యత పొందుతున్నాయి!

కాలచక్ర అంటే ...?

క్రీస్తు పూర్వం ఐదు, ఆరు శతాబ్దాల్లో అప్పటి సామాజిక అసంతృప్తిని ఆలంబనగా చేసుకుని ఆవిర్భవించిన బౌద్ధం అనేక మార్పులకు లోనైంది. హిందూ మతంలోని ఆధిపత్యధోరణికి నిరసనగా ప్రారంభమైన బౌద్ధమతం క్రమేణా ఆ హిందూమత ప్రభావానికే గురయింది. శాఖలుగా చీలిపోయింది. బుద్ధుడు బోధించిన పంచశీలను, నైరూప్య ఆరాధన, ధ్యానాన్ని యథాతథంగా అనుసరించాలనే "హీనయానం" ఒకవైపు, దానికి భిన్నంగా బుద్ధుడినే దేవుడిగా భావించి అతన్ని, అతనితో పాటు మరికొందరు బుద్ధులను దేవుళ్లుగా భావించి ఆరాధించే "మహాయానం" మరోవైపు! క్రమేణా మహాయాన బుద్ధుల్లో హిందూమతంలోని మంత్ర, తంత్రాల పూజలతో కూడిన మరో విభాగం ప్రారంభమయ్యింది. ఈ విధానాన్ని "మంత్రయాన" లేదా "తంత్రయాన"గా పిలుస్తారు. దీనినే "వజ్రయాన" అని కూడా వ్యవహరిస్తారు. బుద్ధుడు తొలుత ప్రవచించిన బోధనల్లో లేని అనేక నమ్మకాలు, తాంత్రిక విద్యలు ఈ తంత్రయానలో చోటుచేసుకున్నాయి. బుద్ధుడు అనేక రూపాల్లో జన్మిస్తుంటాడని, వెయ్యవ బుద్ధుడుగా జన్మించే "వజ్రపాణి" ఈ పరంపరలో ఆఖరివాడని ఈ బౌద్ధులు విశ్వసిస్తారు. తాంత్రిక విద్యలతో కూడిన వారి ప్రార్థనా విధానాల్లో అత్యున్నతమైనదే "కాలచక్ర"!

"కాలం ఓ సజీవ నదిలా సాగుతూనే ఉంటుంది. కాలమే అన్నింటికి మూలం. సృష్టిలోని సమస్తప్రాణులు కాలంలోనే పుట్టి, కాలంలోనే కలిసిపోతున్నాయి" అన్న బుద్ధుని బోధనల సారంనుండి ''కాలచక్ర'' ఆవిర్భవించింది. ప్రకృతి ఉనికికి ముందునుండే వున్న ఈ కాలచక్రం విశాల విశ్వంలో ఎక్కడో వుంటుందని మంత్రయాన లేదా తంత్రయాన బౌద్ధులు విశ్వసిస్తారు. దానిని సాధించేందుకు తాంత్రిక పద్ధతులతో కూడిన యోగానే సరైన మార్గంగా భావిస్తారు. ఆ యోగా ఉపాసనే కాలచక్ర!

మూడుచక్రాల కాలచక్ర!

కాలచక్రంలో ఒకదాని తరువాత ఒకటిగా మూడు చక్రాలు వుంటాయని బౌద్ధులు చెబుతారు. మొదటి చక్రంలో ప్రకృతి, పర్యావరణం, ఆకాశం, సూర్యుడు తదితర గ్రహాలు వుంటాయని, రెండవ చక్రంలో మనిషి,





దలైలామా

భూమి, వ్యక్తి వికాసం, జ్ఞానసిద్ది తదితర అంశాలుంటాయని వారి నమ్మకం. అత్యంత కీలకమైన మూడవ చక్రంలో బుద్ధుడిని, కాలాన్ని ప్రతిష్టించారు. దీనినే 'శ్రీకాలచక్ర' అంటారు. ఈ చక్రమే ఆధ్యాత్మిక సాధనలో అత్యంత కీలమైనదని, మంత్ర, తంత్రాలతో కూడిన యోగాద్వారానే దీని సాధన సులభమవుతుందని తంత్రయానికుల నమ్మకం! ఈ కాలచక్ర ఉపాసనలో బుద్ధుడిని నాలుగుముఖాలు, ఇరవైనాలుగు చేతులు గల రూపంతో ఆరాధించడం బౌద్ధంపై హిందూమతం చూపిన ప్రభావానికి నిదర్శనంగా చెప్పవచ్చు! పన్నెండు రోజులపాటు జరిగే కాలచక్ర మహాసభలలో ఈ శక్తి సాధన లక్ష్యంగా బోధనలు జరుగుతాయి.

నాలుగు తలుపులు

ఉపాసకులను నాలుగుశ్రేణులుగా విభజించిన మంత్రయాన అత్యున్నత శ్రేణికి ఎదగడానికి కాలచక్రను మార్గంగా చెబుతుంది. దీనికోసం నాలుగు రకాల తంత్ర విధులను మంత్రయాన నిర్దేశించింది. ఈ తంత్రాలనే 'నాలుగు తలుపులు' అని వారు వ్యవహరిస్తారు. ప్రార్థనా తంత్ర (ప్రార్థన ద్వారా), ప్రవర్తనా తంత్ర(కోరికలతో, దు:ఖాలను వీడడం), యోగా తంత్ర(వ్యక్తివికాసం, జ్ఞానం కోసం అన్వేషణ), అద్భుత యోగాతంత్ర (జ్ఞానసిద్ది)గా వీటిని నిర్వచించారు. కాలచక్ర ఈ తంత్రాలలో అత్యున్నతమైనదిగా భావిస్తారు. అద్భుతయోగాలో భాగంగా దీనిని నిర్వహిస్తారు. మనిషి నిర్వాణస్థితికి చేరడానికి ఈ నాలుగుతలుపులను దాటకతప్పదని వారి విశ్వాసం.

అమరావతిలో విరాజిల్లనున్న టిబెట్ సంస్కృతి

కాలచక్ర మహాసభల నిర్వహణ, బౌద్ధ మంత్ర తంత్ర పద్ధతులు ఒక ఎత్తయితే, ఈ సందర్భంగా అమరావతిలో ఆవిష్కరింపబడనున్న టిబెట్ సంస్కృతి మరో ఎత్తు! కాలచక్ర ప్రార్థనలను వివిధ ప్రాంతాల్లో తాత్కాలికంగా ఏర్పాటు చేసే ప్రత్యేక టెంటుల్లో నిర్వహిస్తారు. అమరావతిలో కూడా అదే పద్ధతి అనుసరిస్తున్నారు. తాత్కాలిక ప్రాతిపదికన నిర్మించే ఈ టెంట్లే టిబెట్ సాంస్కృతిక వైభవానికి నిలువుటద్దాలుగా నిలవనున్నాయి. అమరావతిలో కాలచక్ర ప్రధాన మందిరాన్ని ధ్యానబుద్ధ ఎదురుగావున్న పది ఎకరాల స్థలంలో నిర్మించనున్నారు. ఈ ప్రధాన మందిరానికి అవసరమైన టెంట్ల రూపకల్పన పనిని కాలచక్ర నిర్వాహక కమిటీ 'నార్బులింగ్కా' ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. టిబెట్‌లోని నార్బులింగ్కా ఇనిస్టిట్యూట్ ఆధ్వరాన దాదాపు ఏడాది క్రితమే టెంట్‌ల రూపకల్పనలో వందలాదిమంది నిమగ్నమయ్యారు. అత్యున్నత టిబెట్ సంస్కృతికి ప్రతీకగా ఈ ఈ ప్రధాన మందిరం రూపొందుతున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. మూడంతస్థులుగా రూపొందే ఈ ప్రధాన మందిరం 67×55 అడుగుల పరిమాణంలో ఉంటుంది. దీని చుట్టూ వాటర్ ప్రూఫ్ కాన్వాస్‌ను అమర్చనున్నారు. పై భాగాన అమర్చే 13 ప్రత్యేక షామియానాలు ప్రాచీన టిబెట్ చిత్రకళా నైపుణ్యానికి అద్దం పట్టనున్నాయి. 11 రంగుల్లో టిబెట్ సాంప్రదాయాన్ని కళ్ళముందు నిలిపేలా వివిధ రకాల చిత్రాలను వీటిపై చిత్రీకరిస్తున్నారు. ఈ మొత్తం కట్టడాన్ని 35అడుగుల పొడవున్న బంగారు పూత పూసిన కాన్వాస్‌తో కప్పటం ఓ ప్రత్యేకత. కప్పు పై భాగాన్ని పూర్తిగా బంగారు పూతతో అలరించడంతోపాటు బౌద్ధ సాంప్రదాయ చిహ్నామైన జింకను, ధర్మచక్రాన్ని ప్రతిష్టించనున్నారు. ప్రధాన మందిరం లోపలి భాగం కూడా పూర్తి కళాత్మకంగా బౌద్ధగురువుల ఆకర్షణీయమైన చిత్రపటాలతో అలంకరిస్తారు. ప్రధాన మందిరం చుట్టూ మూడువైపులా ఆకర్షణీయంగా రూపుదిద్దిన పందిరి వంటి భాగం ఉంటుంది. దీనిలో ప్రత్యేకమైన కలపతో రూపొందించిన ఆసనాన్ని దలైలామా కోసం రూపొందిస్తారు. టిబెట్, పాట్నా, ఢిల్లీ, తదితర ప్రాంతాల్లో తయారయ్యే ఈ టెంట్లను ప్రత్యేక వాహనాల్లో



భారతదేశం మా ఆధ్యాత్మిక గురువు

అమరావతిలో కాలచక్ర బోధనలు నిర్వహించే ప్రధాన మందిరానికి భూమిపూజ కార్యక్రమం ఇటీవల జరిగింది. 15మంది లామాలు ఈ కార్యక్రమంలో మంత్రయాన సాంప్రదాయక పద్ధతుల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భూమిపూజ కార్యక్రమాన్ని చూడటానికి పెద్ద సంఖ్యలో స్థానికులు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని చూస్తున్న వారందరి మెదళ్లలో ఆ సమయంలో ఒకటే సందేహం! సాంప్రదాయం వేరైనప్పటికీ లామాలు పూజలో అనుసరిస్తున్న విధానాలు, వాడుతున్న పరికరాలు భారతదేశంలో తరుచు కనిపిస్తున్నవే కావడం దీనికి కారణం. ఈ శాఖకు చెందిన బౌద్ధుల సాంప్రదాయాలు మన ప్రాచీన సంస్కృతికి, హిందూ సాంప్రదాయ క్రతువులకు దగ్గరగా వుండటం అక్కడ చర్చనీయాంశమైంది "కాలచక్ర" నిర్వాహక కమిటీ, హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన "నార్బులింగ్కా" ఛైర్మన్ కెల్‌సాంగ్ ఈష్ తో ప్రజాశక్తి ప్రతినిధి చేసిన ఇంటర్వ్యూ.

- కెల్‌సాంగ్ ఈష్

కాలచక్ర క్రతువు హిందూ సాంప్రదాయలకు, ఇక్కడి ప్రాచీన సంస్కృతికి చెందిన పోలికలు బాగా కనబడుతున్నాయి. ఎందుకని?

భారతదేశం బుద్ధునికి జన్మనిచ్చింది ... ఈ గడ్డనుండే బౌద్ధాన్ని మేం స్వీకరించాం... అనుసరిస్తున్నాం ... ఇక్కడి సాంప్రదాయాలు మా సంస్కృతిలో కనిపించడం అత్యంత సహజం. భారతదేశం మా ఆధ్యాత్మిక గురువు. ఇప్పటికీ మేం ఇక్కడనుండి నేర్చుకుంటున్నాం.

కాలచక్ర మహాసభల కోసం అమరావతినే ఎందుకు ఎంచుకున్నారు?

బౌద్ధుల సాంప్రదాయక పుణ్యక్షేత్రాలు అత్యధిక భాగం భారతదేశంలోనే వున్నాయి. అమరావతి, ధరణికోటలు మీకే కాదు మాకు కూడా అత్యంత పవిత్రమైనవి. ఇంతకాలం ప్రపంచ బౌద్ధుల దృష్టికి రాని ఈ ప్రాంతం ఇక బౌద్ధదర్శనీయ క్షేత్రాల్లో ఒకటిగా మారి తీరుతుంది. సహజంగానే ఇది మాకు ముఖ్యమైన క్షేత్రం. ఈ కాలచక్ర నిర్వహణానంతరం ఈ జిల్లాలోని నాగార్జునకొండతో పాటు ఇతర బౌద్ధక్షేత్రాలు కూడా ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతాయి. ప్రపంచశాంతి కోసమే అమరావతిలో ఈ కాలచక్ర బోధనలను ఇక్కడ నిర్వహిస్తున్నాం.

ఈసారి అమరావతి కాలచక్రకి ఇంత ప్రాధాన్యత ఎందుకు?

ప్రస్తుత దలైలామా ఆధ్వర్యంలో దాదాపుగా ప్రతిఏడూ ప్రపంచంలోని ఏదో ఒక ప్రాంతంలో కాలచక్ర బోధనలు జరుగుతూనే వున్నాయి. అయితే వాటికి లేని ప్రాధాన్యత అమరావతి బోధనలకు లభిస్తుంది. దానికి మూడు కారణాలు. మొదటిది బుద్ధుడు తొలికాలచక్ర బోధనలను అమరావతిలోనే ప్రవచించాడని మంత్రయాన బౌద్ధులు నమ్మడం! రెండవది బుద్ధుడు నిర్యాణం పొంది ఈ ఏడాదికి 2,550 సంవత్సరాలు పూర్తవుతాయి. అందువల్ల తాజా కాలచక్ర బోధనలకు ప్రాధాన్యత లభించింది. మూడవ కారణం, మంత్రయాన అనుసరించే బౌద్ధులను అమరావతి కాలచక్ర బోధనలకు పెద్దఎత్తున తరలిరావడానికి ప్రేరేపిస్తున్న కీలకమైన అంశం క్షీణిస్తున్న దలైలామా ఆరోగ్యం. ఆయన ఆరోగ్యం ఏటికేడాది క్షీణిస్తుండటంతో బహుశా ఈ బోధనలే ఆయన ఇచ్చే చివరివన్న అభిప్రాయం వారిలో వ్యక్తమవుతోంది. దీంతో లక్షలాది మంది ఈ కార్యక్రమానికి తరలిరానున్నారు.





అమరావతికి తీసుకువస్తారు. ఈ పని ఇప్పటికే ప్రారంభమైంది. కాలచక్ర చివరి రోజున ఈ ప్రధాన మందిరంలోకి ప్రజలను అనుమతిస్తారు.

అమరావతిలోనే ఎందుకు?

కాలచక్ర బోధనలను "లామా"లు తమ జీవిత కాలంలో సాధారణంగా ఒకటి, రెండు సార్లు మాత్రమే నిర్వహిస్తారు. మంత్రయాన తాంత్రిక పద్ధతుల్లో ఇమిడి ఉన్న సంక్లిష్టత రీత్యా లామాలు ఈ పరిమితిని ఏర్పరుచుకున్నారు. అయితే ప్రస్తుత దలైలామా ఆ సాంప్రదాయాన్ని తోసిపుచ్చారు. ఆయన ఇప్పటికే 29 కాలచక్ర ప్రార్థనలను నిర్వహించారు. భారతదేశంలో సైతం పలు ప్రాంతాల్లో ఈ ప్రార్ధనలు జరిగాయి. అయితే ఇవి ప్రధానంగా ఉత్తర భారతానికే పరిమితమయ్యాయి. దక్షిణ భారతదేశంలో ప్రప్రథమంగా అమరావతిలోనే 'కాలచక్ర'ను నిర్వహిస్తున్నారు. ప్రపంచంలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన వాటికన్నా అమరావతిలో ప్రస్తుతం నిర్వహిస్తున్న ప్రార్థనలు ఎంతో ఉత్కృష్టమైనవని, వీటికున్న ప్రాధాన్యత గతంలో నిర్వహించిన వాటికి లేవని, 2006 అమరావతి కాలచక్ర నిర్వహణ కమిటి 'నార్బులింగ్కా' చెబుతోంది. బుద్ధగయలోని బోధి వృక్షం క్రింద జ్ఞానం పొందిన బుద్ధుడు అనంతరం నెలరోజుల్లోనే దక్షిణ భారతదేశంలోని శ్రీపర్వతం సమీపంలో ఉన్న ధాన్యకటకానికి చేరుకున్నాడని, అక్కడ మహాస్థూపం వద్ద మొట్టమొదటి కాలచక్ర బోధనలు చేశారని మంత్రయాన బౌద్ధులు చెబుతారు. బుద్ధుడు తొలిసారిగా కాలచక్ర బోధనలిచ్చిన తరువాత, మళ్ళీ అమరావతిలో ఆ బోధనలు జరగడం ఇదే మొదటిసారని, అందువల్ల వీటికి ఎనలేని ప్రాధాన్యత ఉందని 'నార్బులింగ్కా' కమిటి చెబుతుంది.

అమరావతికి ఏం ఒరుగుతుంది!

అమరావతి, ధరణికోట పట్టణాలు 2006 జనవరిలో జరిగే కాలచక్ర సభలకు ఆతిథ్యం ఇవ్వడానికి సిద్ధమవుతున్నాయి. దాదాపు 25వేల జనాభా నివసిస్తున్న ఈ రెండుపట్టణాల్లో కొన్ని కోట్ల రూపాయల పనులు ఇప్పుడు జరుగుతున్నాయి. ఇలా పనుల వెల్లువ జరగడం ఇక్కడి ప్రజలకు కొత్తేమి కాదు. ఒకటిన్నర ఏడాది క్రితం జరిగిన కృష్ణా పుష్కరాలకు ఇదేవిధంగా కోట్లాదిరూపాయలు వెచ్చించారు. తాత్కాలిక ప్రాతిపదికన పనులు జరపడంతో వీటి ఉపయోగం స్థానికులకు ఏమాత్రం లాభించలేదు. ప్రస్తుతం జరుపుతున్న కాలచక్ర పనులకూ అదే పరిస్థితి. అయితే ఇక్కడో ప్రత్యేకత వుంది. సుదూర ప్రాంతాల నుండి వస్తున్న బౌద్ధుల వసతుల కల్పనకు కాలచక్ర నిర్వాహక కమిటీ విపరీతంగా ఛార్జీలు వసూలు చేస్తోంది. బౌద్ధులు టెంట్లలో వసతికోసం 15 రోజులకు 50నుండి 60వేల రూపాయలు చెల్లించాలని ఈ కమిటీ నిర్ణయించింది. తక్కువరకం వసతి డేరాకు అద్దె పదివేల రూపాయల దాకా వుంది. దీన్ని అవకాశంగా తీసుకున్న స్థానికులు తమ ఇళ్ళ అద్దెలను అమాంతం పెంచేశారు. అయినా చాలినన్ని ఇళ్ళులేక ఎంతమొత్తమైనా పెట్టడానికి బౌద్ధులు సిద్ధమవుతున్నారు. ఇదొకవైపైతే, మరోవైపు అమరావతిలో ఇళ్ళు, ఇళ్ళస్థలాలు లేనివారు దాదాపు వెయ్యిమందిదాకా వున్నారు. వీరు తమకు కనీసవసతి కల్పించాలని అధికారుల చుట్టూ కొన్ని సంవత్సరాల నుండి తిరుగుతున్నారు. అమరావతిలో స్థలం సేకరించి ఐఎవై కింద ఇళ్ళు నిర్మించి, బౌద్ధులకు నామమాత్రపు అద్దెకు వసతిగా ఇవ్వాలని, ఆ తరువాత ఇళ్ళు లేని నిరుపేదలకు వీటిని కేటాయించాలని సిపియం జిల్లా అధికారులను కోరింది. దీనివల్ల యాత్రికులపై ఆర్థికభారం తొలగడంతో పాటు, స్థానికులకు శాశ్వతప్రయోజనం కలుగుతుందని అధికారులూ అంగీకరిస్తున్నప్పటికీ ఆచరణలో మాత్రం ఎప్పటి మాదిరి నాన్చుడు వైఖరే!

*

'అమరావతి'గా ఇలా మారింది!

ఒకప్పుడు బౌద్ధ వికాసానికి కేంద్రమైన ఈ చిన్నపట్టణం హైందవ పురాణాల్లో కనిపించే అమరావతిగా కాలక్రమేణా ప్రఖ్యాతమయింది. ఇప్పటివరకు లభించిన చారిత్రిక ఆధారాలు పరిశీలిస్తే అమరేశ్వ రాలయ ప్రస్థావన ఉన్నప్పటికీ పట్టణానికి మాత్రం 'శ్రీధాన్యకటకము' అన్నపేరే మొదట్లో ప్రసిద్ధి! ప్రాకృతభాషా శాసనాల్లో 'దఞకడ' అని ఉంది. సంస్కృత, తెలుగు శాసనాలలో శ్రీధాన్యకటకము, ధాన్యవాటి, ధాన్యవాటిక, ధాన్యాలపురము, ధాన్యఘటము, ధరణాలకోట, దంనాలకోట, ధరణికోట, ధనాడ పేర్లు ఉన్నాయి. కాలక్రమేణా ఈ ధరణాల కోట... ధరణికోట, దంన్నాలకోటగా మార్పు చెందింది. 'ధారణీ'లంటే బౌద్ధుల మంత్ర తంత్రములు. వాటికి ఈ ప్రాంతం పెట్టని కోటగా మారడంతో ఈ పేర్లు వచ్చి ఉంటాయని పరిశోధకుల అంచనా! నేడు అమరావతిలో ఉన్న బౌద్ధస్థూపం నాడు 'ధరణాలకోట' పట్టణ పరిధిలోది. రాత్రులందు ఈ స్థూపం చుట్టూ ప్రమిదలలో దీపాలుంచడంతో దీనిని 'దీపాలదిన్నె' అని కూడ పిలిచేవారు. 18వ శతాబ్దంలో ధరణికోటను పరిపాలించిన జమిందారు రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు తన రాజధానిని 'చింతపల్లి' (ప్రస్తుతం గుంటూరు జిల్లా అచ్చంపేట మండలంలో ఉంది) నుండి ధరణికోటకు సమీపంలోఉన్న అమరేశ్వరాలయం వద్దకు మార్చారు. అక్కడ ఆయన ఒక పట్టణాన్ని నిర్మించి, ఆ నూతన పట్టణానికి "అమరావతి" అనే పేరుపెట్టారు. అలా అమరావతి తొలి సారి చరిత్రలో కనపడుతుంది.



ఆరోగ్యం

విటమిన్ల కథ

ఫోలిక్‌యాసిడ్

డాక్టర్ నాగినేని భాస్కరరావు

మనం సాధారణంగా పిలిచే ఫోలిక్‌యాసిడ్ శాస్త్రీయ నామం టెరోయిల్ మోనో గ్లూటామిక్‌యాసిడ్. ఆహారంలో లభించే కొన్ని రకాల ఫోలిక్‌యాసిడ్ రూపాలు వండేటప్పుడు నాశనమవుతాయి.

ఆహార పదార్థాలను వండే పద్ధతిని బట్టి, ఆహారపు ప్రకృతిని బట్టి ఫోలిక్‌యాసిడ్ శోషింపబడుతుంది. ఇది జెజునమ్ అనే చిన్నప్రేవు భాగం నుంచి శోషింపబడుతుంది.

సాధారణంగా మానవ శరీరంలో అన్ని చోట్లా కలిపి ఐదు నుంచి ఇరవై మిల్లీగ్రాముల ఫోలిక్‌యాసిడ్ నిల్వ ఉంటుంది.

కార్బన్ మోయిటీలను ఉదాహరణకు మిథైల్, ఫార్మైల్ వర్గాలను అనేక రకాలైన జీవ మిశ్రమాలకు పంపడం అనేది ఫోలిక్‌యాసిడ్ ప్రాథమిక ధర్మం. పెద్దలకు సాధారణంగా రోజుకు 50 మి.గ్రా. ఫోలిక్ యాసిడ్ అవసరం. కానీ గర్భిణీ స్త్రీలకు ఎక్కువ అవసరమవుతుంది. మనం తీసుకునే ఆహారంలో 500 నుంచి 800 మి.గ్రా. ఫోలిక్‌యాసిడ్ ఉంటుంది.



మన శరీరంలో ఫోలిక్‌యాసిడ్ లోపం ఏర్పడటానికి అనేక కారణాలున్నాయి. తక్కువగా శరీరంలోకి తీసుకోవడం అంటే సంపూర్ణ ఆహారాన్ని తీసుకోక పోవడం ముఖ్యంగా సారాయి తాగుడుకు బానిసలైనవారు, యుక్త వయస్సులో ఉన్న వారు, కొంత మంది శిశువులు.

కొన్ని పరిస్థితుల్లో ఫోలిక్‌యాసిడ్ రోజువారీ అవసరం పెరుగుతుంది. గర్భిణీ స్త్రీలలో, శైశవ దశలో, కాన్సర్ జబ్బు, రక్తాన్ని కోల్పోవడం, దీర్ఘకాలికంగా పొట్టుడిపోయే చర్మ వ్యాధులు, హీమోడయాలసిస్ ఉన్న వారికి దీని అవసరం ఎక్కువగా ఉంటుంది. ట్రోపికల్ స్ప్రూ, నాన్ - ట్రోపికల్ స్ప్రూ, కొన్ని మందులు ఉదాహరణకు ఫినిటోయిన్, బార్బ్యుటురేట్లు, సారాయి వంటి వాటి వల్ల సరిగ్గా శోషించబడదు.

మెథోట్రెక్సేటు, పైరిమిథామిన్, ట్రయాంటెరీన్, పెంటామిడిన్, ట్రైమిథోప్రిమ్ వంటి మందుల వల్ల, ఆల్కహాల్ అంటే సారాయి, అరుదుగా ఎంజైముల లోపాల వంటి వాటివల్ల జీవక్రియ కుంటుబడి ఫోలిక్‌యాసిడ్ లోపం ఏర్పడుతుంది.

ఫోలిక్‌యాసిడ్ ఈ దిగువ పేర్కొన్న ఆహార పదార్థాలలో లభిస్తుంది. అనేక రకాల పండ్లు, కూరగాయలు ఫోలిక్‌యాసిడ్‌ను కలిగి ఉంటాయి. అనేక మొక్కలు, పెద్ద ప్రేవులలోని బ్యాక్టీరియా దీనిని తయారు చేస్తాయి. కాలేయం, మూత్రపిండాలు, క్యాబేజీ, పాలకూర వంటి ఆకుకూరలు, ఈస్టు, పండ్లలో ఫోలిక్‌యాసిడ్ అధికంగా లభిస్తుంది. పాలలో, గుడ్లలో ఫోలిక్‌యాసిడ్ చాలా తక్కువగా ఉంటుంది.

*



కథ

చెదరని ఆకాంక్ష

సి హెచ్ కాశీవిశ్వనాథ్

"పక్కకొచ్చి నిలువ్...! ఎన్నిసార్లు చెప్పాలి...?" హూంకరించాడా పోలీసు.

"నన్నెలాగైనా లోపలికి పంపించండి" వేడుకుంటున్నాడతను.

"పాస్ లేనిదే అనుమతించేది లేదు" తెగేసి చెప్పాడు మరో అధికారి.

"కొద్ది సేపాగిన తర్వాతైనా లోనికి పంపక పోతారా..." అనుకుంటూ గేటు పక్కకొచ్చి నిలబడ్డాడతను.

నేనిదంతా గేటులోపలి నుంచి గమనిస్తున్నాను. మనస్సు చివుక్కుమనిపించింది. ఈ బందోబస్తుకు కారణం... ఓ ప్రముఖ పత్రిక రజతోత్సవ సంబరాలకు ప్రధానమంత్రి వస్తున్నారు. పాస్ లేనిదే ఎవరినీ లోనికి అనుమతించడం లేదు. తెలిసిన వ్యక్తి ఏర్పాటు చేసిన పాసుతో నేను లోపలికి ప్రవేశించగలిగాను. అతను... కొద్దిసేపు అక్కడే నిలబడ్డాడు. అతన్ని లోనికి వదులుతారేమోనని ఎదురుచూశాను. వదల్లేదు. పరధ్యానంగా నడుస్తూ లోపలికెళ్లాను. కూర్చున్నాను. కొద్దిసేపట్లో... ప్రధానమంత్రితో పాటు అతిరథమహారథులంతా విచ్చేశారు. మధ్యాహ్నానికి కార్యక్రమం పూర్తయింది. చిన్నగా బయటపడ్డాను.

అతను... మెయిన్ గేటు పక్కనే ఉన్న ఫుట్‌పాత్‌పై కూర్చున్నాడు. కాకీనిక్కరు, మాసిన షర్టు వేసుకున్నాడు. ఏవో బాధల్లో ఉన్నట్లనిపిస్తోంది. దగ్గరకెళ్లి పలకరించాను. అతని మాటలు... నూతిలోంచి వస్తున్నట్లున్నాయి. మాట్లాడే ఓపికూడా అతనికి లేనట్లు గ్రహించాను. రమ్మనగానే లేచి నా వెంటే వచ్చాడు. పక్కనే ఉన్న ఓ భోజనశాలకెళ్లాం. భోజనమయ్యేంత వరకూ అతన్ని పలకరించలేదు. అతను తింటున్న వాలకాన్ని బట్టి చూస్తే బాగా ఆకలితో ఉన్నట్లనిపించింది. ఇద్దరం కలసి మళ్లీ ఆడిటోరియానికొచ్చాం. ఓ చెట్టు కింద కూర్చున్నాం. తనిక్కడికి రావడానికి గల కారణం చెప్పసాగాడు.

❊ ❊ ❊

"ఓ యాభై రూపాయలుంటే ఇయ్యమ్మా...! పట్నం పోవాలే! పెద్ద నాయకులంతా వస్తారట...! ఒక్కసారెల్లి చూసొస్తాను!" అంటూ కూతురిని అడిగాడు సాంబయ్య.

"నువ్విప్పుడు వాళ్లను చూడకపోతే వచ్చిన నష్టమేమీ లేదు...! నీకు తిండి పెట్టడమే ఎక్కువ. ముసలోడివవుతున్నావు. ఇంకా పార్టీ పిచ్చి తగ్గలేదు. నువ్వు సంపాయించి ఇచ్చిన ఆస్తులేమీ లేవిక్కడ. నోర్మూసుకుని ఇంట్లో పడుండు" అంటూ గయ్యిన లేచింది.

కన్నకూతురి మాటలు ఈటెల్లా దిగబడ్డాయి. అతని మనసు విలవిల్లాడింది. అతను... రిక్షా మెకానిక్ సాంబయ్య. ఆస్తిపాస్తులేమీ లేవు. ఒక్కాగానొక్క కూతురిని తన రెక్కల కష్టం మీద చదివించాడు. పెళ్లి చేశాడు. ఆమె ఓ ప్రభుత్వ కార్యాలయంలో టైపిస్టుగా చేస్తోంది. అల్లుడు ప్రయివేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. భార్య పోయినప్పటినుంచీ కూతురి దగ్గరే ఉంటున్నాడు. వయసు మీద పడింది. పనిచేయలేక పోతున్నాడు. షుగరు, బిపి వచ్చాయి.

ఆ వేడుకలను ఎలాగైనా సరే కళ్లారాచూడాలని నిర్ణయించుకున్నాడు. తన గదిలో ఉన్న పుస్తకాలన్నీ మూటగట్టాడు. మాక్సిం గోర్కీ రచనలు, రోమిలా థాపర్ చరిత్రపుటలు... కారల్ మార్క్స్ క్యాపిటల్ మూడు భాగాలు, కమ్యూనిస్టు యోధులుగా తీర్చిదిద్దే మావో లెనిన్ రచనలు, సుందరయ్య, ఎకె గోపాలన్, హోచిమిన్‌ల జీవిత చరిత్రకు సంబంధించిన పుస్తకాలవి. వాటిని ఒక్కసారి తడిమి చూసుకున్నాడు. కళ్లల్లో నీళ్లు తిరిగాయి. 35 ఏళ్ల పాటు తన జీవితంతో పెనవేసుకుపోయిన అపురూపగ్రంథాలవి. వీటిని తెగనమ్మడం కష్టమనిపించింది. అయినా తప్పలేదు. అలా పుస్తకాలను షాపులో చేరడాన్ని, ప్రతిగా తన చేతిలో ఓ మూడొందలు రావడాన్ని చూసుకుంటూ ముందుకు నడిచాడు. మనస్సు చిక్కబట్టుకున్నాడు.

పట్నం చేరుకున్నాడు. సిటీ బస్సు పట్టుకుని ఆడిటోరియం వద్దకు చేరుకున్నాడు. అతని అవతారం చూసి పోలీసులు నెట్టేశారు. అందునా ప్రధాన మంత్రి హాజరవుతున్న కారణంగా పాస్ లేనిదే ఎవ్వరినీ లోనికి అనుమతించడం లేదు. ఆ పత్రిక కార్యకర్తలకు సాంబయ్య గురించి తెలిసే అవకాశమే లేదు. ఇంత కష్టపడ్డా... తన కోరిక నెరవేరక పోయేసరికి బాధపడుతూ అక్కడే కూలబడ్డాడు.

సాంబయ్య చెప్పింది విన్నాక చాలా బాధపడ్డాను. పెద్దవాళ్లం ఆదర్శాలతో ఎదిగినప్పటికీ... పిల్లలకు ఆ చైతన్యం ఎక్కకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవు. నేటి నుంచే నా కుంటుంబ సభ్యుల్లో అవగాహన కల్పించే విధంగా కృషి చేయాలని గట్టిగా నిశ్చయించుకున్నాను. సాంబయ్య మొహమాటం కొద్దీ వద్దంటున్నాడు. నేను వినలేదు. ఆ అపురూప గ్రంథాలు తిరిగి తెచ్చుకోవడానికి మూడు వందలు అతని జేబులో పెట్టి వెనుదిరిగాను.

ఓ రెండు రోజుల తరువాత...తన అడ్రస్సెలా తెలుసుకున్నాడో గానీ... ఇంటి కొచ్చాడు. మా ఆవిడతో, పాపతో చక్కగాస్నేహం కలిపి రెండు రోజులుఇంటి పనీ, దొడ్లో బాగు చేసే పని చేసి వెళ్లిపోయాడు సాంబయ్య.

❊

ఓ మంచి పుస్తకం

మధ్య యుగాల భారత దేశం

సతీష్‌చంద్ర, మధ్య యుగాల భారత దేశం, ప్రజాశక్తి బుక్ హౌస్, హైదరాబాద్, 2005, పేజీలు 300, వెల 100/-

వి. రామకృష్ణ

మధ్య యుగాల భారత దేశం



మధ్య యుగాల భారతదేశం సతీష్ చంద్ర రాసినది. పాఠశాల విద్యార్థులకు (11,12 తరగతులు) ఎన్‌సిఇఆర్‌టి వారు ఆంగ్లంలో తయారు చేసిన ఈ గ్రంథాన్నిప్పుడు తెలుగులోకి తీసుకొచ్చారు. పాఠశాల విద్యార్థుల కోసం ఉద్దేశించబడినా, దాని ప్రామాణికతా, నూతన రీతిలో రాసిన దృష్ట్యా, ఈ గ్రంథాన్ని అన్ని స్థాయిల విద్యార్థులు, ఉన్నత స్థాయి పోటీ పరీక్షలకు హాజరయే అభ్యర్థులూ గత మూడు దశాబ్దాలకు పైగా పఠిస్తున్నారు. సతీష్‌చంద్ర కొత్త ఆధారాలను, పర్షియన్ రచయితల గ్రంథాల నుండి, సమకాలీన రచనల నుండి సేకరించారు. శాస్త్రీయంగా, కార్యాకారణ సంబంధంతో రాజకీయ ఘటనలు వివరిస్తూ, ఆర్థిక పరిస్థితులనూ సమాజానికీ, సంస్కృతికీ వున్న పరస్పర సంబంధాన్ని సవివరంగా చర్చించాడు. మధ్య యుగాల భారతదేశ చరిత్ర రచన సంక్లిష్టమైనది. అప్పట్లో దేశాన్ని ప్రధానంగా పాలించిన రాజ్యవంశాలు ఇస్లాంమతానికి చెందినవి. అయినా, వీరు ముఖ్యంగా ఉత్తర భారతంలోనే వున్నారు. మహారాష్ట్ర, రాజస్థాన్, దక్షిణ భారత దేశంలో ముస్లిమేతర రాజ్యాలు పాలించాయి. ఈ మత, రాజకీయ పరస్పర సంబంధాన్ని ఎలా విశ్లేషించాలనేది ఒక సమస్య. వలస చరిత్ర కారులు ఈ కాలాన్ని, తమ పాలనను సమర్థించుకోడానికి, చీకటి యుగంగా, ముస్లిముల పాలన క్రూరమైనదిగా, మత అసహనంతో గూడుకొన్నదిగా వర్ణించారు. ఇది నిజామా ? కాదు.

ఎలాగంటే, విభిన్న మతాలకు చెందిన రాజ్యాలు ప్రాచీన యుగంలోనూ ఉన్నాయి. వీటి మధ్య నిరంతరం యుద్ధాలు జరిగాయి. యుద్ధాల్లో, రాజ్య విస్తరణ కాంక్ష ప్రధానంగా చోటు చేసుకోగా, మతం అప్రధాన అంశంగా మిగిలిపోయింది. కాకుంటే, మతాన్ని రాజకీయ లబ్ధికి పావుగా వాడుకొన్నారు. అంతే! మధ్య యుగానికి సంబంధించి, ఢిల్లీని కేంద్రంగా పాలించిన సుల్తాన్ పాలకులు గానీ, మొగలులు కానీ, ఇస్లాం మతాన్ని తమ రాజ్యమతంగా ఎన్నడూ ప్రకటించలేదు. ఖురాన్ ప్రవచించిన ఇస్లామిక సూత్రాలను రాజ్య నిర్వహణకు సంబంధించి తు.చ. తప్పకుండా పాటించనూ లేదు. పైగా చక్రవర్తులందరూ, తమ అధికారాన్ని నిరాటంకంగా చెలాయించుకోడం కోసం ముస్లిం, మత గురువుల అధికారాన్ని ఖాతరు చేయలేదు.



తద్వారా ప్రజల్లో వాడుకలో వున్న అపోహలను, సహేతుకంగా, ఆధారసహితంగా తొలగిస్తూ, మధ్య యుగాల చరిత్రలోని వైశిష్ట్యాన్ని వివరించాడు గ్రంథకర్త.

భారతీయ సంస్కృతి ఈ కాలంలో వికసించిన క్రమాన్ని, ఇస్లాం సంస్కృతితో సంపర్క ఫలితంగా, నెలకొన్న సామాజిక పరిస్థితులను 8,16,17 అధ్యాయాల్లో వర్ణించారు. మొగలు చక్రవర్తి అక్బర్ 'జాతీయ చక్రవర్తి'గా పేర్గాంచిన విధానాన్ని వివరిస్తున్నప్పుడు గానీ, లేదా, మధ్య యుగ చరిత్రలో కరడు గట్టిన మత దురహంకారుడుగా కొందరు చరిత్ర కారులచే పరిగణింపబడ్డ ఔరంగజేబును విశ్లేషిస్తున్నప్పుడు గ్రంథకర్త సమతుల్యాన్ని పాటించాడు. మొగలుల కాలంలో దేశం సాధించిన ఆర్థిక ప్రగతి, చేతి పరిశ్రమల పెంపుదల, జౌళి పరిశ్రమలో ప్రపంచంలోనే తలమానికమైన తీరును చక్కగా వివరించాడు.

హిందూ , ఇస్లాం, సిక్కు మతాల పరస్పర అవగాహన, సంపర్కం కళాసారస్వత రంగాల్లో అద్భుతమైన ప్రగతిని సాధించింది. ఈ యుగంలో భక్తి, సూఫీ ఉద్యమాలు తలెత్తి, ఇస్లాం- హిందూ మతాల మధ్య సామరస్యానికి తోడ్పడ్డాయి. బహుళ స్వభావం కలిగిన భారతీయ సంస్కృతి రూపు దిద్దుకొంది.

20 అధ్యాయాలతో, 350 పుటలతో ఈ గ్రంథం అనువాదం సాఫీగా ఆంగ్ల, మాతృకకు భంగం కలగకుండా ఉంది. ఎన్‌డిఏ ప్రభుత్వం అనుసరించిన కాషాయీకరణ విధానానికి బలై పాఠ్య గ్రంథంగా తొలగించబడడంతో ఆశ్చర్యం లేదు. ఇదే కాకుండా, రోమిలాథాపర్, ఆర్.ఎస్. శర్మ గ్రంథాలూ తొలగించబడ్డాయి. రాజకీయాలను మత మయం చేసి, రాజకీయ లబ్ధికి మతాన్ని, మత అసహనాన్ని, దేశాన్ని రెచ్చగొట్టే చర్యలు చేపట్టిన సంఘ పరివార్, ఈ చర్యలకు బలంగానే మూల్యం చెల్లించాల్సి వచ్చింది.

చరిత్రను మానవజీవిత యదార్థ దృశ్యంగా చూడాలనుకొనే విజ్ఞులు తప్పకుండా చదవాల్సిన గ్రంథం ప్రజాశక్తి బుక్ హౌస్, సామాజిక శాస్త్రాలకు ఇలాంటి గ్రంథాలు ప్రచురించడం ద్వారా, చేస్తున్న సేవ అభినందనీయం.

డా॥ దేవరాజు మహారాజు

> ఒక్క నిముషం ఆలోచించింది. అనసూయమ్మ-డాక్టరు దగ్గరికి వెళ్ళి పరీక్షలు చేయించుకోవడంమే తెలివిగల పనని నిర్ణయించుకుంది. గబుక్కున వెనక్కి తిరిగింది. తన భర్తను వెతుక్కుంటూ రోడ్డు వైపు నడిచింది.

పెరుగుతున్న బాబాలు

అనసూయమ్మకు పెండ్లయి పదిహేనేళ్ళయ్యింది. సంపన్న కుటుంబం. అన్యోన్యంగా ఉండే భర్త. కాని ఒకటే లోటు ఆమెకు పిల్లలు కలగలేదు. 'పిల్లలు లేని స్త్రీ జీవితం పరిపూర్ణం కాదు' అని ఎవరైనా అనుకుంటూ ఉంటే, ఆమె మనసు చివుక్కుమంటుంది. పట్నం వెళ్లి పెద్ద డాక్టర్లతో పరీక్ష చేయించుకోవాలనుకుంది. కాని, ఎప్పటికప్పుడు అశ్రద్ధ ! పైగా వ్యవసాయపు పనులతో తనకూ, తన భర్తకు తీరుబడే దొరకదు. అలాంటి సమయంలో పక్క ఊరి నుండి వచ్చిన సునంద ఓ విషయం చెప్పింది. వెంటనే చేసి చూడమంది. అనసూయమ్మ అలాగేనంది. భర్తను ఒప్పించి మరునాడే నిజామాబాద్ బయలుదేరింది. యాభై మైళ్ల బస్సులో ప్రయాణం చేసి, బాలబాబా దగ్గరికి చేరుకుంది. అక్కడికి వెళ్లేసరికి ఆయన సందర్శకుల వరుస చేంతాడంత ఉంది. గత్యంతరం లేక ఆమె కూడా అందులో నిలబడింది. వరుస నెమ్మది నెమ్మదిగా ముందుకు కదులుతోంది. బాలబాబా దగ్గరికి చేరేసరికి ఆమెకు అరగంట పట్టింది. అయితే బాలబాబాను చూసి ఆమె తెల్లబోయింది.

బాలాబాబా అంటే ఎవరో కాదు, తన స్నేహితురాలు అండాళు కొడుకే ! అనసూయమ్మ గుర్తు పట్టింది. రెండేళ్ళ క్రితం అండాళ్లు కొడుకును తీసుకొని, తన దగ్గరికి వచ్చిన విషయం గుర్తుకువచ్చింది. అప్పుడు ఆ కుర్రాడికి ఎనిమిదేళ్ళు. రోజులు గడవడం కష్టంగా ఉందంటే అప్పుడు వారికి తనకు తోచిన సహాయం చేసి పంపింది. ఇప్పుడు ఆ కుర్రాడే.. పదేళ్ళ బాలబాబాగా అవతారమెత్తాడు. నల్లటి కుర్రాడు. తెల్ల ప్యాంటు, తెల్ల చొక్కా వేసుకున్నాడు. అందరినీ ఆశీర్వదిస్తున్నాడు. నెయ్యి, కొబ్బరికాయలు, డబ్బులు స్వీకరిస్తున్నాడు. బొంగురు గొంతుతో "సంతాన ప్రాప్తి చేస్తా ! సంతాన ప్రాప్తి చేస్తా!!" అని చేతులెత్తి అంటూ ఉంటే అనసూయమ్మకు నవ్వాలో ఏడవాలో తెలియలేదు. పిల్లా, పీచు, ముసలి, ముతకా అందరూ అతని ఆశీర్వాదాలు అందుకుంటున్నారు. అనసూయమ్మకు ఏం చేయాలో తోచలేదు. ముందుకు పోవడానికి మనసు ఒప్పుకోలేదు. వరుస తప్పితే మళ్ళీ వెనక నిలబడాలి.

ఒక్క నిముషం ఆలోచించింది అనసూయమ్మ-డాక్టరు దగ్గరికి వెళ్ళి పరీక్షలు చేయించుకోవడంమే తెలివిగల పనని నిర్ణయించుకుంది. గబుక్కున వెనక్కి తిరిగింది. తన భర్తను వెతుక్కుంటూ రోడ్డు వైపు నడిచింది. బతుకు దెరువుకోసం అండాళ్లు, కొడుకును బాలబాబాగా మార్పించిందని ఆమె పూర్తిగా గ్రహించింది.

పుట్టపర్తి సత్యసాయిబాబాను ఆదర్శంగా తీసుకుని కొత్త కొత్త బాబాలు పుంఖానుపుంఖాలుగా పుట్టుకొస్తున్నారు. ఆ మధ్య ప్రశాంతి నిలయంలో జరిగిన యువకుల హత్యల గురించి అటు బాబాగాని, ఇటు ప్రభుత్వం గాని ప్రజలకు వివరణ ఇవ్వలేదు. ఇక ఈ చిన్నచిన్న బాబాల విలువ ఏ పాటిది ? మేజిక్‌లు మాని, కాలానుగుణంగా సామాజిక సేవా కార్యక్రమాల వైపు దృష్టి మరల్చిన పుట్టపర్తి సాయిబాబాలోని పరివర్తన హర్షించదగిందే ! అయితే జన్మదిన వేడుకలకు స్టార్ బ్యాట్స్‌మన్ అయిన క్రికెటర్లు ఎందుకు అవసరమయ్యారు? వారికి ప్రాధాన్యమివ్వడం దేనికీ ? వారి ఆధారంగా తన ఇమేజ్‌ను నిలబెట్టుకునే ప్రయత్నమని అర్థం చేసుకోవాలా ? కేక్ కట్ చేయడం ఎందుకు,? నిశితంగా ఆలోచిస్తే ఇవన్నీ సహజంగా సామాన్యులకు ఉండే చిరుకోర్కెలు. బాబా కూడా వాటిని అధిగమించలేకపోయాడన్నది విజ్ఞులు గ్రహించాలి.

నాంపల్లి బాబా చనిపోతే అతని మరణాన్ని అంగీకరించక మళ్ళీ బతుకుతాడని అతని అనుచరులు శవదహనాన్ని అడ్డుకుని, నానారభస చేసిన విషయం తెలిసిందే కదా? బిర్యానీ తన ప్రసాదంగా ఇచ్చే ఓ బిర్యాని బాబా వెలుగులోకి వచ్చాడు. రోగాలు నయం చేస్తానని అమానుషంగా తన మూత్రాన్ని రోగులతో తాగించిన బాబా ఒక్కడైతే, బూతులే మంత్రాలుగా వల్లించే మౌలాలి బూతుల బాబా ఒకడు. ఇతని అసలు పేరు కృష్ణస్వామి నందిగామలో విరాజిల్లాడు. ఈయన ప్రత్యేకత ఏమిటంటే రైతుల పంటల్లో వాటా అడుగుతాడు. ఇక కర్నూలు ప్రాంతంలోని బాల సత్యసాయి డబ్బులు గుప్పించి సినీ నటుల్ని పిలిపించుకుని, జన్మదిన వేడుకలు జరిపించుకున్నాడు. అన్నం, డబ్బులు ఎరచూపి సామాన్య జనాన్ని రప్పించుకున్న బాల సత్యసాయి, వారికి అవి అందించలేక అభాసుపాలయిన విషయం టి.వి. న్యూస్ ఛానల్స్‌లో మనం చూశాం. ప్రసార మాధ్యమాలు ఇలాంటి వారి గూర్చి ఎంతగా ప్రచారం చేస్తున్నా కొంత మంది వారిని నమ్ముతూనే ఉన్నారు. మోసపోతూనే ఉన్నారు. పేదరికం, అజ్ఞానం పునాదులుగా వున్న ఈ సమాజంలో బాబాల సంఖ్య నానాటికీ పెరగడంలో ఆశ్చర్యం లేదు.

బాలబాబా దర్శనానికి వెళ్ళి, నిజం గ్రహించి వెనుదిరిగి వచ్చిన అనసూయమ్మలా ప్రతి ఒక్కరూ ఆలోచించగలిగిన నాడు సమాజం బాగుపడుతుంది. అందుకోసం మన ప్రయత్నాలు మనం చేస్తూనే ఉండాలి.

*

కొల్లేటి కోట

హేమలత

అదో కోట... దానిచుట్టూ పహారా కాస్తున్నట్లుగా ఆకాశాన్నంటుతున్న కోటగోడలు... ఆకాశాన్నంటేలా ఉన్న కంచుద్వారాలు... ఈ గోడల చుట్టూ పెద్ద అగడ్త... దీని చుట్టూ గొప్ప జలదుర్గం... ఇదేంటో పద్మవ్యూహంలా ఉందే... అనుకుంటున్నారా? అవునుమరి. ఈ కోటలోకి అడుగుపెట్టాలనుకునే శత్రురాజులకు ఇదో పద్మవ్యూహమే!

ఇంతకీ ఈ కోట పేరేంటబ్బా అనుకుంటున్నారా? ఇదే కొల్లేటి కోట. దీని చుట్టూ ఉన్న ఈ పెద్ద జలదుర్గమే నేటి కొల్లేటి సరస్సు. వేంగీ పురం... ఈ పేరెప్పుడో విన్నట్లుందే అనుకుంటున్నారా? చాళుక్యరాజైన ప్రథమ జయసింహ వల్లభమహారాజు ఆంధ్ర నగరాన్ని వేంగీపురమని వర్ణించాడనీ, దీని సమీపాన ఉన్న సరస్సే కొల్లేరనీ ప్రముఖ చరిత్రకారుల అభిప్రాయం.

ఈ కొల్లేటి కోటను... కాల క్రమంలో శత్రురాజులు ముట్టడించారట. కోట లోపలికి చొచ్చుకుపోవాలని విఫల ప్రయత్నం చేశారు. 'కోటలోకి ప్రవేశించడమెలా?' అని తీవ్రంగా ఆలోచించారు. సరస్సులోని నీటిని సముద్రంలోకి ప్రవహింపజేయటమే సరైన మార్గంగా వారికి తోచింది. అదే తడవుగా ఆ సరస్సుకు ఒక గండి కొట్టించారు. ఓ సైన్యాధికారి తన కుమార్తెను అందులో ఆహుతిచ్చాడట. అప్పుడు కొల్లేరు నీరు తగ్గిపోయిందనీ, కోట వారికి స్వాధీనమైందనీ చరిత్ర కారుల అభిప్రాయం. ఆ సేనాని కుమార్తె పేరు పేరంటాలు. అందరూ దీనిని పేరంటాలు కనుమ అనే పేరుతో పిలుస్తారు.

ఇదిలా ఉంటే... ఈ కొల్లేరు విషయంలో ప్రచారంలో ఉన్న స్థానిక పూర్వ గాథ ఒకటి చూడండి. స్థానికులు చెప్పుకునే ఈ కథలకు ఎటువంటి శాసన దృష్టాంతరాలూ, చారిత్రక పరిశీలనలూ ఉన్నట్లు ఆధారాలూ లేవు. ఇంతకీ కొల్లేరు గురించి వీరేం చెబుతారో తెలుసుకోవాలనుందా...

వర్షాకాలం... వర్షాలు కురుస్తాయనే అనుకుంటున్నారు కదా. కానీ అక్కడలా కురవలేదు. ఫలితంగా ప్రజలు ఆందోళన చెందారు. బ్రాహ్మణులు యాగాదులు చేశారట. ఫలితం శూన్యం. ఆ ప్రాంతంలో తీవ్రమైన కరువు ఏర్పడింది. ఒక బ్రాహ్మణ గృహిణి జలాభావంచే తనకాలి మడిమతో అక్షతలను తడిపి, హోమంలో వేయడానికి తన భర్తకిచ్చిందట. వాటిని యజ్ఞహోమంలో వేయగానే... బంగారు కణికలుగా మారాయట. ఆ విషయం తెలుసుకున్న అక్కడి వారంతా అలానే చేయనారంభించారట. ఆ ఒక్క బ్రాహ్మణ కుటుంబం మాత్రం దీనికి పాల్పడలేదట. వీరికి ఒకనొకనాడు 'శక్తిదేవత' కలలోకొచ్చి అగ్నిహోత్రములతో ఆ చోటు విడిచిపెట్టిపోవాలనీ, మార్గంలో ఒక్కొక్క అగ్నికణములను పడేసుకుంటూ పోవాలనీ చెప్పి అదృశ్యమైపోయిందట. మరుసటి రోజు ఆ బ్రాహ్మణోత్తముడు దేవత చెప్పినట్లుగానే చేశాడట. కొంతదూరం వెళ్లిన తర్వాత... వెనక్కి తిరగి చూశాడట... ఆశ్చర్యం... ఆ పురమంతా జలమయైపోయి ఉన్నదట. ప్రజలు దీన్నే 'కొల్లేరు' పేరుతో వ్యవహరించేవారట.

చైనా బౌద్ధ యాత్రికుడైన హ్యూయన్‌త్సాంగ్ జయసింహుని కాలంలో తెలుగుదేశ పర్యటనకు విచ్చేశాడనీ, వేంగీ నగరాన్ని కొల్లేటిని సందర్శించారని తెలుస్తోంది. ఈ కొల్లేరు తీరానికి తూర్పుదిశలో... ఒక గొప్ప బౌద్ధ విహారముండేదట. దీనిలో ఐదంతస్థుల మేడ ఉండేదనీ, ఆ విహారానికి అధిపతిగా దిజ్నాగాచార్యుడు ఉండేవారనీ ప్రజలు చెప్పుకుంటారు. ఈయన ఆరోశతాబ్దంలో సుప్రసిద్ధ పండితుడని వీరి మాటల వల్ల తెలుస్తోంది.

కండ్లు మిరుమిట్లు గొలిపే ఆనాటి కోటగోడలు... ఆభేద్యమైన ఆగడ్త, ఆ మహానగరం ఐదంతస్థుల మేడ, బౌద్ధవిహారము ఇవేమీ నేడు కనిపించలేదు. కాల గర్భంలో కలిసిపోయాయి. గత చరిత్ర వైభవానికి నిదర్శనంగా ఒక్క కొల్లేటి "పెద్దింట్లమ్మ" గుడి మాత్రం ఉంది. ఇప్పటికీ ఏటేటా పెద్దింట్లమ్మ పూజలందుకుంటోంది. కొల్లేరు సరస్సేయో అన్యాక్రాంతమైపోతోంది. " కొల్లేరు కొంప" కొల్లేరయిపోతోంది.

*



వెచ్చని పాట

బాధ్యతలు బద్ధలై
బంధనాలు ఇంధనాలై
బాయ్‌నెట్ మీదు కదులుతున్నాయి
ఒక విశృంఖల పహారాకాస్తున్నాయి
సంయమన... సంయమన
పదిలం....పదిలం
జాగతేరహో...జగాతే చలో...

ఎక్కడ ఏ తల్లి పేగు తెగుతుందో
ఎక్కడ ఏ తండ్రి కన్ను చెదురుతుందో
ఎక్కడ ఏ పసితనం నీడ కూలుతుందో
జర పదిలం బిడ్డా... పదిలం కొడుకా...
ధ్వనించే... జ్వలించే...
జనం గొంతుక విస్తృతించే బాటలో
నవ పల్లవం చిగురించనీ...
బతుకు కొమ్మలో
పచ్చదనం ప్రవహించనీ...
ఆ రెమ్మల్లో.... ఆ పూలల్లో
ఒక వెచ్చని పాట సాగనీ....

-పొట్లపల్లి శ్రీనివాసరావు



మాటకూ
చేతకూ
తేడాలేని
చేయినొకదాన్ని
నాటుతాను
చూద్దాం...!
ఈ లోకమంతా
చేతుల చేలు...
చేతల వనాలు
అవ్వవా !!

అవీ... ఇవీ

ఆస్ట్రేలియా అయ్యవార్లకు అసలు పరీక్ష

ఆస్ట్రేలియా స్కూళ్లలో పాఠాలు చెప్పే అయ్యవార్లు ముందు తమకు సరిగా చదవనూ, రాయనూ వచ్చని నిరూపించుకొంటే గానీ క్లాసులోకి అడుగుపెట్ట నివ్వొద్దని జాతీయ అక్షరాస్యత విచారణ కమిషన్ సిఫార్సు చేసింది. టీచర్లకు కనీసంగా కూడా అక్షరాస్యత నైపుణ్యం ఉండటం లేదని, వారు ఆసక్తి కూడా చూపటం లేదని కమిషన్ పేర్కొన్నది. వాటిని పెంచేందుకు టీచర్ ఎడ్యుకేషన్‌లో మార్పులు తేవాలని కూడా సూచించింది. టీచర్ ఎడ్యుకేషన్ సంస్థలలో ప్రమాణాలు సరిగా లేవని గతంలో విమర్శలు వచ్చాయి. వాటిని గమనంలో ఉంచుకొని టీచర్లుగా పని చేసే వారికి ప్రాతిపదిక డిగ్రీలు కాదని, తమకు చదవనూ, రాయనూ వచ్చని ఉద్యోగంలో చేరే ముందు నిరూపించుకోవాలని కమిషన్ పేర్కొన్నది. అయితే అది ఎలా ఏమిటి అని స్పష్టం చేయలేదు. టీచర్ ఎడ్యుకేషన్ విద్యార్థులను పరీక్షించేందుకు తమను అడ్డుకున్నట్లు కొందరు విద్యావేత్తలు కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. విద్యార్థులలో కనీసం 20 శాతం మందికి తీవ్రమైన భాషా సమస్యలున్నాయని, అలాంటి వారు పిల్లలకు ఏం నేర్పుతారని ఒక విద్యావేత్త ఆవేదన వ్యక్తం చేశారు. అంటే ఆస్ట్రేలియాలో కూడా మన రాష్ట్రంలో మాదిరి ప్రొఫెసర్లు, లెక్చరర్లు లేని ఎడ్యుకేషన్ కాలేజీలు డిగ్రీలు ఇచ్చి పంపుతున్నాయన్న మాట. మన వాళ్లే వెళ్లి అక్కడ కాలేజీలు గానీ పెట్టలేదు కదా?

- ఎంకెఆర్

విజ్ఞాన వీచిక



ఎస్. వెంకట్రావు

ఇప్పుడిక ముఖాలు మార్చబడును!

మనిషి ముఖాలకు తొడుగులు తగిలించుకోవడం అనేది ప్రాచీన మానవ సమాజాల్లోనే ప్రారంభమైన విద్య. ఒకరి ముఖాన్ని మరొకరికి తొడగడం ద్వారా రూపం మార్చుకోవడం అనేది మానవునికి అనాదిగా వస్తున్న కల. ఈ కల చుట్టూ మనుషులు అనేక కథలు అల్లారు. ప్రాచీన పురాణాల్లోనే కాదు, ఆధునిక క్రైమ్ నవలల్లో కూడా ముఖాలు మార్చే ప్రక్రియను బాగా ఉపయోగించుకున్న విషయం మనకు తెలుసు. మన టివీ సీరియళ్లలో కూడా ఇటీవల ఇటువంటి కథలు చాలా వచ్చాయి. కాని ఇప్పటివరకు కలగానూ, కథలుగానూ ఉన్న 'ముఖమార్పిడి' ప్రక్రియను ఫ్రెంచ్ వైద్యుల బృందం నిజం చేసింది.

ఈ ఏడాది నవంబర్ చివరిలో ఒక ఫ్రెంచ్ మహిళకు వైద్యులు ముఖమార్పిడి శస్త్ర చికిత్స చేసి చరిత్ర సృష్టించారు. చరిత్ర ఎందుకంటే వైద్య శాస్త్ర వేత్తలు చెపుతున్న దాని ప్రకారం మానవాళి చరిత్రలో ఇది తొలి 'ముఖమార్పిడి'. ఇప్పటివరకు మనుషుల ముఖాలకు ప్లాస్టిక్ సర్జరీలు చేసిన ఘటనలు విన్నాం కాని ఏకంగా ఒకరి ముఖాన్ని తీసుకొచ్చి మరో మనిషికి అతికించిన ఘటన చరిత్రలో ఇదే ప్రథమం.

అసలేం జరిగింది

ఈ ఏడాది మే నెలలో ఉత్తర ఫ్రాన్స్‌లోని వాలెన్సిన్నెస్ నగరానికి చెందిన 38 ఏళ్ల మహిళ ముఖాన్ని ఆమె పెంచుకున్న లాబ్రడార్ కుక్క పీకేసింది. ఆమె పెదాలు, ముక్కు, బుగ్గలతో సహా ఊడి వచ్చేసింది. బ్రతుకు మీద విరక్తి కలిగేట్టుగా ఆమె ముఖం వికృతంగా తయారయింది. దవడలు, ముఖ ఎముకలు బయటపడ్డాయి. ఆహారం తీసుకుంటే పళ్ల సందుల్లోంచి బయటకు వచ్చేది. ముఖం కప్పుకోవలసిందే గాని ఇతరులకు చూపించడానికి లేని పరిస్థితి దాపురించింది.

ఫ్రాన్స్‌లోని లియోన్ నగరానికి చెందిన డాక్టర్ జీన్ మైఖేల్ దుబెనార్డ్ ఆమె పరిస్థితిని చూసి 'ముఖమార్పిడి' శస్త్ర చికిత్స చేయాలని నిర్ణయానికి వచ్చి చికిత్స మంచి చెడులను గురించి ఆమెకు చెప్పాడు. ఆమె దానికి అంగీరించడంతో 'ముఖమార్పిడి' శస్త్ర చికిత్సకు ఏర్పాట్లు చేశాడు. ఈయన గతంలో 'చేయిమార్పిడి' శస్త్ర చికిత్స చేసి ఉన్నాడు. అమీన్స్ యూనివర్సిటీ ఆసుపత్రికి చెందిన డాక్టర్ బెర్నార్డ్ దెవాచెల్లె బృందం డాక్టర్ దుబెనార్డ్‌కు సహకరించింది. రెండు బృందాలు కలిసి తొలి 'ముఖమార్పిడి' నిర్వహించాలనుకున్నారు. దీనికి గాను మహిళకు ముఖాన్ని దానం చేసే దాత కావలసి వచ్చింది. అమీన్‌కు 85 కిలోమీటర్ల దూరంలోని లిల్లె నగర ఆసుపత్రిలో బ్రెయిన్ డెడ్ అయిన ఒక మహిళను ఎన్నుకున్నారు. ఫ్రాన్స్ చట్టం ప్రకారం ప్రత్యేకమైన అభ్యంతరాలు లేకపోతే చనిపోయిన వారి అవయవాలను ఇతరులకు మార్పిడి చేయవచ్చు. లిల్లె నగర ఆసుపత్రిలో బ్రెయిన్ డెడ్ అయిన మహిళ ముఖాన్ని నవంబర్ 26వ తేదీ రాత్రి డాక్టర్ దెవాచెల్లె బృందం తొలగించింది. అదే సమయంలో అమీన్ యూనివర్సిటీ ఆసుపత్రిలో ముఖానికి శస్త్రచికిత్స చేయాల్సిన మహిళ (డాక్టర్లు ఈమె పేరును వెల్లడించకూడదని నిర్ణయించుకున్నారు)ను సిద్ధం చేశారు. లియోన్ నుండి తెచ్చిన ముఖాన్ని మహిళకు అమర్చారు. చర్మాన్ని అతికించడమే కాదు, అత్యంత సూక్ష్మ రక్త నాళాలను కూడా అతికంచడం అత్యంత నైపుణ్యంతో చేయాల్సిన పని. ప్రధాన శస్త్ర చికిత్సకు అయిదు గంటలు పట్టగా మొత్తం శస్త్ర చికిత్సచేయడానికి 15 గంటలు తీసుకుంది. శస్త్ర చికిత్స చేసిన 24 గంటల తరువాత మహిళ ముఖానికి ముసుగు తీసేశారు. ఆమె అద్దంలో తన ముఖాన్ని చూసుకుంది. పెద్ద ముక్కు, దళసరి పెదాలు తన మొఖం పాత ముఖం కాదు. కాని అదే సమయంలో వికృతమైపోయిన తన ముఖానికి ఏదో ఒక రూపాన్ని వైద్యులు సమకూర్చారు.

అంతా అయిపోలేదు

శస్త్ర చికిత్స జయప్రదం అయినా మహిళకు రిస్కు తగ్గలేదు. నిజానికి అతికించిన ఇతరులకు చెందిన కణజాలాన్ని మహిళ ముఖం స్వీకరిస్తుందా లేక 'తిరస్కరిస్తుందా' అన్నది మరో ఆరుమాసాల్లోగాని పూర్తిగా తెలదు. ముఖం మార్పిడి చేసుకున్న మహిళకు 'ఇమ్మునో సప్రెస్సివ్ థిరపీ' ఇస్తున్నారు. అంటే పరాయి కణజాలాన్ని మహిళ శరీరం తిరస్కరించకుండా వైద్యం అన్నమాట. ఆమె ముఖం అలాగే ఉండాలంటే జీవితాంతం 'ఇమ్మునో సప్రెస్సివ్' మందులు వాడాల్సి ఉంటుంది. అవి వాడినా పూర్తిగా ఆమె శరీరం పరాయి కణాలను స్వీకరిస్తుందనడానికి లేదు. కొద్ది మాసాల్లోగాని, ఏడాదిలోగా గాని ఆ తరువాత కూడా పరాయికణాల 'తిరస్కారం' జరగొచ్చు. అప్పుడు మళ్లీ కథ మొదటికొస్తుంది. అంతే కాదు ఇప్పుడు చేసిన ఆపరేషన్ కూడా కొద్ది వారాలు గడిస్తేనే గాని పూర్తిగా జయప్రదం అయిందో లేదో చెప్పలేమని డాక్టర్లు చెబుతున్నారు. ఇటువంటి అపరేషన్లలో రోగి చనిపోవడానికి కూడా 33 శాతం అవకాశాలుంటాయి. ఈ ప్రమాదాలన్నిటికీ మహిళ సిద్ధపడిన తరువాతనే వైద్య బృందం ఈ శస్త్ర చికిత్సకు సిద్ధపడింది.

వివాదం

'ముఖమార్పిడి' శస్త్ర చికిత్స చుట్టూ అనేక వివాదాలు సుడులు తిరుగుతున్నాయి. నిజానికి ఈ వివాదాలే చాలా కాలంగా ఇటువంటి వైద్య విన్యాసం జరక్కుండా అడ్డుకుంటున్నాయికూడా. గతంలో ముఖమార్పిడి జరిగింది భారత దేశంలోనే. 1990లో క్రషర్ మిషన్‌లోపడి ముఖం చెక్కుకుపోయిన 13 ఏళ్ల అమ్మాయి చర్మాన్ని డాక్టర్లు తిరిగి అతికించారు. అమెరికాలోనూ, ఇతర దేశాల్లోనూ పాక్షిక ముఖమార్పిడి జరిగింది. అయితే పూర్తి స్థాయిలో, ఒకరి ముఖాన్ని మరొకరికి మార్చడం మాత్రం ఇదే ప్రథమం. ముఖాన్ని మార్చడం వల్ల ఆరోగ్యపరమైన రిస్కులతోబాటు చనిపోయిన మనిషి ముఖం కొత్త వ్యక్తి ముఖానికి అమర్చడం అనేది అనేక నైతిక ప్రశ్నలను లేవనెత్తింది. ముఖమార్పిడి జరిగిన వ్యక్తి చనిపోయిన వ్యక్తి ముఖంతో తిరగడం అనేది చాలా మందికి రుచించడం లేదు. అయితే వైద్యులు చెప్పేదేమంటే ముఖ మార్పిడివల్ల చినపోయిన వ్యక్తి ముఖం రూపురేఖలు యథాతథంగా కొత్త వ్యక్తికి రావు. ఇద్దరు వ్యక్తుల రూపాలకు భిన్నమైన మూడో రూపం వస్తుందని చెబుతున్నారు. ఏమైనా ప్రస్తుతం శస్త్ర చికిత్స చేయించుకున్న ఫ్రెంచ్ మహిళ పూర్తిగా కోలుకుంటేనే 'ముఖం మార్పిడి'కి సంబంధించిన అనేక ప్రశ్నలకు సమాధానాలు దొరుకుతాయి. అయితే ఈ లోగా ఒక విషయాన్ని మాత్రం ఈ శస్త్రచికిత్స నిర్ధారించింది. అదేమంటే ఇప్పుడిక ముఖాలు మార్చడం ఆచరణాత్మక మైన విషయమే.

✻



కొత్త పుస్తకాలు

ప్రదర్శనకే కాదు పఠనానికి కూడా...



పూర్వకాలంలో కళాప్రదర్శనలకు స్క్రిప్ట్ లేదు. జానపద సాంప్రదాయంతో ఒకరినుంచి ఒకరికి, తరాలు మారినట్లు కళాజ్ఞానం కూడా కొనసాగేది. వందితులైన కవులు, రచయితలు రాసి ఈ కళాకారులకు ఇవ్వడం అనే పద్ధతి వచ్చాకే ఆయా కళారూపాలకు రాతప్రతిలో స్క్రిప్టులేర్పడ్డాయి. నాటి కళాప్రదర్శనలు సామాజిక స్థితిగతులకు అద్దంపట్టి, సంఘానికి పనికివచ్చే సందేశం ప్రసరింపజేసేవి. అలాంటి కళాప్రక్రియల్లో నృత్యానికి నృత్యరూపకాలకు మరింత ప్రాధాన్యత ఉంటాయి. జానపదీయ మైనవి, చారిత్రకమైనవి, పౌరాణికమైనవి ఇలా అనేక తరహాల్లో ఆ కళారూపాలు అలరారాయి. అలాంటి చారిత్రక విశేషాంశాలతో కూడిన కళారూపాలను రూపొందించడంలో మంచి అనుభవం ఉన్న సాహితీ తపస్వి పోలవరపు కోటేశ్వరరావు అనేక నృత్యరూపకాలను రచించారు. ఇటీవల వారు రాసిన రెండు నృత్యరూపకాలే "కృష్ణా వైభవం", "భద్ర". పుస్తకరూపంలో ఈ రెండు కళారూపాలను సుజాత ప్రచురణలుగా మనముందుకు తెచ్చారాయన. "కృష్ణా వైభవం" స్థలపురాణంగానూ, "భద్ర"(కుండలకేశిని) చారిత్రక గాథగానూ చెప్పుకోవచ్చు. పురాతన మానవేతిహాసమంతా నదీతీరాలవెంట సాగిందని చరిత్రకారుడు రాహుల్‌సాంకృత్యాయన్ అంటారు. ఈ 'కృష్ణావైభవం' నృత్యరూపకం లో కృష్ణాజిల్లా గురించి అక్కడ చారిత్రక నాగరికతా కథనం కృష్ణానది పరవళ్ల వర్ణనలతో ప్రారంభమవుతుంది. ఆ నదీతీరాలకున్న పౌరాణిక గాథల నుంచి ఆంగ్లేయుల రాక, కాంగ్రెస్, కమ్యూనిస్టు ఉద్యమాలు, ఎన్టీరామారావుగారి పాలనలో ఆంధ్రప్రదేశ్‌కు అంతర్జాతీయ ఖ్యాతి దక్కిందన్నంత వరకూ చారిత్రక కథాంశంగా నడుస్తుంది. నృత్య రూపకంగా ఒక శుద్ధమైన డాక్యుమెంటరీ ఇది. 25 పేజీలలో ఈ నృత్యరూపకానికి చోటిచ్చి, మిగిలిన 28 పేజీలలో అనుబంధాలుగా ఎంతో విలువైన సమాచారాన్ని పొందుపరిచారు. శ్రీకృష్ణదేవ రాయలు రచన 'ఆముక్త మాల్యద', 'హంసలదీవి వేణుగోపాల శతకం', ఆంధ్రనాయక శతకము', 'యుద్ధమల్లుని బెజవాడ శాసనము' తదితర విలువైన సాహిత్యపర పురాతత్వశాస్త్ర ఆధారా లను ఈ పుస్తకంలో పొందుపరిచారు. అంత తేలిగ్గా దొరక నటువంటి కృష్ణా జిల్లా ప్రముఖుల అపురూపమైన ఫొటోలు కూడా ఈ అనుబంధంలో చేర్చడం బాగుంది. రెండవదైన "భద్ర" రూపకం గౌతమ బుద్ధుడి బోధనలతో తమ జీవిత మార్గాన్ని బౌద్ధంలోకి మార్చుకున్న వారిలో ఒకరైన భద్ర అనే ఆమె వృత్తాంతం.

వ్యాపారి కూతురైన భద్ర తండ్రి తెచ్చిన వరులను కాదని సాహసుడని భావించిన ఓ అందమైన దొంగను, అదీ ఉరి శిక్షకు గురి కాబోయేవాణ్ని పెళ్లాడుతుంది. నగలమీదే తప్ప ఆమె మీద ప్రేమలేని అతను భద్రను చంపబోగా యుక్తిగా అతణ్నే చంపి విరాగి అయి, చివరకు బుద్ధుని శిష్యుడైన శారిపుత్రుని బోధనలతో సన్యాసిని అవుతుంది. ఒకనాటి భారతీయ కళాసాహిత్యాలకి విచిత్రానుభూతులకు గురిచేసి, వేరే లోకాలకు విహరింపజేసి, ఆ కథాత్మ అయిన సందేశాన్నిచ్చే గుణంతో ఉండేవి. అలా ఈ భద్ర కథాత్మ అయిన 'బుద్ధుని అష్టమాంగమార్గం ఉత్తమం అందులోకి రండి' అనే సందేశం ఇచ్చేది. ఈ కళారూపానికి కూడా ముందు పేజీలలో ఆ వృత్తాంతాన్ని ఇవ్వడం చదువరులకు చాలా ఆహ్లాదాన్నిస్తుంది. తమ్మా శ్రీనివాసరెడ్డి అందించిన కొన్ని బౌద్ధ చరిత్రకు చెందిన ఫొటోలు చాలా ఆకట్టుకునేవిధంగాఉన్నాయి.

అందుకే ఈ రెండు కళా ప్రదర్శనీయమైనవే కాదు, పఠనీయమైనవి కూడా!

- శంకర్

కృష్ణావైభవం, (సంగీత నృత్య రూపకం), , పేజీలు: 56, వెల: రూ.100/-,
భద్ర(కుండలకేశిని), పేజీలు: 64, వెల: రూ. 50/-
రచన: పోలవరపు కోటేశ్వరరావు, ప్రతులకు: సుజాత ప్రచురణలు, 33-16-12 కస్తూరిబాయిపేట, విజయవాడ-10

అద్దం

(కవితా సంపుటి)

వెల:75/-, పేజీలు:96

ప్రతులకు :

డా॥ దమ్ము శ్రీనివాసబాబు

1-9-52ఝుసిర్ఝు2, రాంనగర్

హైదరాబాద్, ఫోన్ 27610783

అజ్మీరు గీతాలు

కవితా సంపుటి

రచన కె. రాజేశ్వరరావు

వెల 5/-

ప్రతులకు : అజ్మీరు వీర భద్రయ్య

విశ్రాంతోపాధ్యాయుడు

మక్కపేట, వత్సవాయి మండలం, కృష్ణాజిల్లా



కృష్ణ పక్షము



ఆత్మాశ్రయరీతులకు ఆద్యుడిగా దేవులపల్లి కృష్ణశాస్త్రి. భావకవిత్వాన్ని రాశారు. అంతేకాకుండా ఆయన ఊరూరా తిరిగి భావ కవిత్వానికి గౌరవ స్థానాన్ని తెచ్చిపెట్టారు అలాంటి ఈ వ్యక్తిని భావ కవిత్వోద్యమనాయకుడిగా గుర్తించడంలో ఆశ్చర్యమేముంది? ఆత్మాశ్రయం, వేదన, ప్రకృతి, విరహం, పదాల పోహలింపు, గాన లక్షణం ఇవన్నింటినీ కలగలపే కృష్ణ పక్షం. కృష్ణశాస్త్రి స్వేచ్ఛాగానం చేయడానికి గురజాడ, రాయప్రోలులేర్పరచిన నవ్యమార్గం తోడ్పడింది. కృష్ణశాస్త్రి అనుసరించిన ఆధునిక రీతులను 'కృష్ణపక్షము' సింహావలోకనంలో శివశంకర శాస్త్రి వివరించారు. స్వతంత్ర బుద్ధి, దు:ఖము, ప్రేమాంకురం, ఈశ్వరా రాధన అనే నాలుగు విధములుగా కృష్ణశాస్త్రి భావతరంగిణి ప్రవహిస్తోందని ఆయన అన్నారు. ఆత్మాశ్రయమైన కవితా ధోరణికి కృష్ణశాస్త్రిగారు గురుపీఠమై నిలిచారు. ప్రేయసి మరణానికి దు:ఖించి రచించిన "ప్రవాసము" ఆధునిక కవులు ఓ విధమైన కావ్యరచన చేయడానికి ఒరవడిపెట్టింది. విశ్వప్రేయసి 'ఊర్వశి'పై ఆయన రచించిన కావ్యం "ఊర్వశి". ప్రణయ కావ్యాలలో ఇది ఓ మకుటయమానమై నిలిచింది. ఈ మూడు ఖండకావ్యాల సంపుటమే "కృష్ణపక్షం". దీనిలోని అనేక కవితలు కొటేషన్లుగానూ, రెఫరెన్సులుగానూ స్థిరపడ్డాయంటే అంతకుమించిన ప్రశస్థి ఇంకేముంది? కవిత్వాన్ని ఆస్వాదించే వాళ్లే కాకుండా, కవిత్వం రాయాలనుకున్న వాళ్లూ తప్పనిసరిగా చదవాల్సిన పుస్తకం ఈ కృష్ణపక్షము.

-కె. పి. అశోక్ కుమార్

"కృష్ణ పక్షము" దేవులపల్లి కృష్ణశాస్త్రి,
ప్రతులకు: విశాలాంధ్ర, వెల 30/-

పులిబొంగరాలు

కావలసిన వస్తువులు

గోధుమపిండి	:	రెండు కప్పులు
శనగపిండి	:	అర కప్పు
జొన్నపిండి	:	అర కప్పు
నూనె	:	నాలుగు టీ స్పూన్లు
జీలకర్ర పొడి	:	ఒక టీ స్పూన్
ఉప్పు	:	తగినంత
అరటిపండ్లు	:	రెండు
మెంతి ఆకులు	:	ఒక కప్పు
పసుపు	:	పావు స్పూన్
కారం	:	ఒక స్పూన్
ధనియాల పొడి	:	ఒక స్పూన్

తయారుచేసే విధానం

ఒక బేసిన్‌లోకి గోధుమ, శనగ, జొన్న పిండిని వేసి బాగా కలపాలి. అందులో మెంతికూర ఆకులు, రెండు టీ స్పూన్లు నూనె, మిగిలిన పదార్థాలన్నీ వేసి, అరటి పండ్లను కూడా వేసి బాగా కలపాలి. ఇవన్నీ కలిపిన తరువాత అవసరముంటేనే నీళ్ళు పోయాలి. మామూలుగా అయితే పండ్ల తడే సరిపోతుంది. ఈ పిండి ముద్దమీద ఓ అరగంట తడి గుడ్డ వేసి ఉంచాలి. ఇప్పుడు పిండిని మళ్ళీ బాగా మెదాయించి చిన్న చిన్న ఉండలు చేయాలి. వాటిని చెపాతీలుగా ఒత్తి పెనం మీద వేసి కాల్చేటప్పుడు కొంచెం నూనె వేసి సమంగా కాల్చాలి. వీటిని వేడిగా పెరుగుతో తింటే రుచిగా ఉంటాయి. ఇవి రెండు రోజులు నిల్వ ఉంటాయి. ప్రయాణాల్లో బాగుంటాయి.

రుచి

కావలసిన వస్తువులు

బియ్యం	:	అరకిలో
మినపప్పు	:	పావు కిలో
పెద్ద ఉల్లిపాయ	:	నాలుగు
పచ్చిమిర్చి	:	పది
నూనె	:	అరకిలో
కరివేపాకు	:	రెండు రెబ్బలు
అల్లం	:	చిన్న ముక్క
ఉప్పు	:	తగినంత
పచ్చిశనగపప్పు	:	50 గ్రాములు
జీలకర్ర	:	రెండు స్పూన్లు

తయారుచేసే విధానం

బియ్యం, మినపప్పు నానబెట్టుకోవాలి. నానిన తరువాత శుభ్రంగా కడిగి మెత్తగా రుబ్బుకోవాలి. పెద్ద ఉల్లిపాయ, అల్లం, పచ్చిమిర్చి సన్నగా తరిగి ఈ పిండిలో కలపాలి. ఉప్పుకూడా వేసి కలిపి ఒక పూట నాననివ్వాలి. పిండి పులిస్తే రుచి బాగుంటుంది. జీలకర్ర, కరివేపాకు కూడా కలిపి నూనె కాగిన తరువాత ఇవి

మెంతికూర రొట్టెలు

పులిబొంగరాలుగా వేసుకోవాలి. ఇవి బాగా పొంగుతాయి. ఇవి మెత్తగా రుచిగా ఉంటాయి. ఇవి చట్నీ లేకుండా కూడా తినవచ్చు.

- ఎ. జ్యోతి

కలంస్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీక్కూడా వీళ్లలాగా కలం స్నేహం చెయ్యాలని వుందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకుని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్ ఫొటోను అతికించి పోస్టు చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలూ చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే. మరి మా అడ్రస్: కలం స్నేహం, **బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.**

పేరు: కె.క్రాంతి
వయసు: 14 సం॥
చదువు: 9వ తరగతి
స్కూలు: మాడపాటి హనుమంతరావు హైస్కూలు
హాబీలు: టీవీ చూడడం, కథలు చదవడం, బొమ్మలు వేయడం, క్యారమ్స్ ఆడడం
చిరునామా: కె.క్రాంతి, డాటరాఫ్ కె.ఎక్స్.రాజు, జవహర్‌నగర్, హైదరాబాదు.

పేరు: ఎం.శ్వేత
వయసు: 10 సం॥
చదువు: 5వ తరగతి
స్కూలు: అభ్యుదయ హైస్కూల్
హాబీలు: పాటలు పాడడం, కార్టూన్ నెట్‌వర్క్ చూడడం, డాన్స్ చేయడం
చిరునామా: ఎం.శ్వేత, డాటరాఫ్ ఎం. శ్రీనివాసరావు, గాంధీనగర్, హైదరాబాద్.

పేరు: అనిపినేని సత్యప్రకాష్
వయసు: 10 సం॥
చదువు: 5వ తరగతి
స్కూలు: మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల
హాబీలు: పాటలు పాడడం, టీవీ చూడడం, ప్రజాశక్తి పేపరు చదవడం, కలంస్నేహం చేయడం
చిరునామా: అనిపినేని సత్యప్రకాష్, సన్నాఫ్ నాగరాజు, 2-116, దానరిగూడెం, కొక్కిరపాడు, పెదపాడు, ప.గో.

పేరు: అన్నా సందీప్ కుమార్
వయసు: 16 సం॥
చదువు: 10వ తరగతి
స్కూలు: శ్రీ వివేకానంద విద్యాపీఠం
లక్ష్యం: డాక్టర్ కావడం
హాబీలు: పుస్తకాలు, వార్త, ప్రజాశక్తి పేపర్ చదవడం
చిరునామా: అన్నా సందీప్ కుమార్, సన్నాఫ్ అన్నా వెంకటేశ్వర్లు, కస్తూరి వీధి, ఇం.నెం: 9-142, మార్కాపురం, ప్రకాశం.

పేరు: నన్నూరి శ్రావణ్ కుమార్
వయసు: 11 సం॥
చదువు: 5వ తరగతి
హాబీలు: ప్రజాశక్తి చదవడం, క్రికెట్ ఆడడం, టీవీ చూడడం
చిరునామా: నన్నూరి శ్రావణ్ కుమార్, కేరాఫ్ బి.కొండయ్య, ఇం.నెం: 23-1253, విష్ణు కుండిన నగర్, వినుకొండ, గుంటూరు-522647.

పేరు: ఎస్‌కె. ఆసీఫ్ పాషా
వయసు: 10 సం॥
చదువు: 5వ తరగతి
స్కూలు: సిపిఎస్ కేంద్ర ప్రాథమిక పాఠశాల
లక్ష్యం: ఎస్‌పి అయి ఊరికి మేలు చేయడం
హాబీలు: చదవడం, ఆటలు ఆడడం, అక్కయ్యలను ఏడిపించడం, అల్లరి చేయడం
చిరునామా: ఎస్‌కె. ఆసీఫ్ పాషా, సన్నాఫ్ ఎస్‌కె.అక్తర్, పాతమిట్టపల్లి, తల్లాడ, ఖమ్మం.

పేరు: సంగు సాయికిరణ్
వయసు: 10 సం॥
చదువు: 6వ తరగతి
స్కూలు: శ్రీవాణి విద్యాలయం
లక్ష్యం: కండక్టర్ కావడం
హాబీలు: ప్రజాశక్తి పేపరు చదవడం, టీవీ చూడడం
చిరునామా: సంగు సాయికిరణ్, నన్నాఫ్ నంగు శివరాం (కండక్టర్), సిద్దన్నపేట, నంగునూర్, మెదక్-502280.